మా కలం - సామాన్యుడి బలం

స్వర్ణసాగరం

CELL : 9440352036

WWW.SWARNASAGARAM.COM

PRGI : APTEL/26/A1104 జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

9440352036

ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్

సంపుటి : 1, సంచిక : 207

పేజీలు : 8, వెల : 2-00

మంగళవారం 3 నవంబర్ 202

రాప్తాడు బాలికపై దాడి..
ప్రభుత్వ వైఫల్యమే కారణం

- బెంగళూరులో బాధితురాలికి పరామర్శ
- వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- బాలిక కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి
- వైద్యం ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించాలి
- గంజాయి, మద్యం విక్రయాలపై నియంత్రణ ఏదని ప్రశ్న



బెంగళూరు/అమరావతి, స్వర్ణసాగరం

అనంతపురం జిల్లా రాప్తాడులో పాఠశాల బాలికపై జరిగిన దాడి ఘటనపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. రాష్ట్రంలో మత్తుపదార్థాల వినియోగం, గంజాయి విక్రయాలు పెరిగిపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే పాఠశాలల్లోనూ విద్యార్థినులకు రక్షణ లేకుండా పోతోందని విమర్శించారు. బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలికను జగన్ పరామర్శించి, ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో ఆరోగ్య పరిస్థితిపై ఆరా: రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత - మిగతా 3లో

విపత్తుల వేళ రైతుకు బీమా భరోసా

- నష్టపరిహారం త్వరగా అందించాలి: చంద్రబాబు
- ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా పరిహారం
- రైతులు, కౌలురైతులకు నష్టం జరగకుండా చర్యలు
- తుపాన్లతో పంట నష్టంపై తక్షణ అంచనాలు
- కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలి
- 'మురసు' తుపాను ఎదుర్కొనేందుకు యంత్రాంగం అప్రమత్తం

3లో






రోడ్డు పనుల్లో
పెను విషాదం

- విద్యుదాఘాతంతో 8 మంది కార్మికులు మృతి!
- 11 వేల వోల్టుల విద్యుత్ తీగలకు తగిలిన నిర్మాణ యంత్రం
- రాజస్థాన్‌లోని ఝుంఝునూ జిల్లాలో ఘోర ప్రమాదం
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

ప్రతి మండలంలో కూటమి
జెండా ఎగరాలి

- స్థానిక ఎన్నికలపై చంద్రబాబు దిశానిర్దేశం
- 28 జెడ్పీ చైర్మన్ స్థానాలే లక్ష్యం
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో సమష్టి వ్యూహం
- కూటమి పార్టీల మధ్య పూర్తి సమన్వయం ఉండాలి
- ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ
- కౌంటింగ్ వేళ అప్రమత్తంగా ఉండాలని సూచన



పార్టీల ముఖ్యనేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీల మధ్య సమన్వయం, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్‌తో పాటు కూటమి పార్టీల ముఖ్యనేతలు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో - మిగతా 3లో

అమరావతి, స్వర్ణసాగరం

రాష్ట్రంలోని ప్రతి మండలంలోనూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి జెండాలు రెపరెపలాడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా సోమవారం కూటమి



దీపావళికి గ్రీన్ క్రాకర్స్‌కు
సుప్రీంకోర్టు ఓకే!

- నవంబర్ 7, 8 తేదీల్లోనే అనుమతి.. రోజుకు రెండు గంటలు మాత్రమే
- ఉదయం 6-7 గంటలు.. రాత్రి 8-10 గంటల వరకు అవకాశం
- ఆస్పత్రులు, విద్యాసంస్థల పరిసరాల్లో 300 మీటర్ల వరకు నిషేధం
- నవంబర్ 9 నుంచి మళ్లీ పూర్తి స్థాయి నిషేధం

2



బీజేపీ ప్రచారం బూమరాంగ్.. దిల్లీలో యథావిధిగా మార్కెట్లు!

- ఇండియా కూటమి ర్యాలీతో వ్యాపారాలకు నష్టం లేదన్న కాంగ్రెస్
- దుకాణాలు తెరిచే ఉన్నాయి.. కొనసాగిన కొనుగోళ్లు
- బీజేపీ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టారు: జైరాం రమేశ్
- స్థానిక వ్యాపారులకు అండగా నిలవాలని రాహుల్ పిలుపు

2




భారత వైమానిక దళానికి
కొత్త అధిపతి

- 29వ చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్
- ఎయిర్ చీఫ్ మార్షల్‌గా బాధ్యతల స్వీకరణ
- ఏపీ సింగ్ స్థానంలో నియామకం
- నాలుగు దశాబ్దాల సైనిక సేవ.. 3,300 గంటలకు పైగా విమానయాన అనుభవం
- ఆపరేషన్ సింధూర్‌లోనూ కీలక బాధ్యతలు

నేడే.. కౌంటింగ్

- ప్రశాంతంగా ముగిసిన రీపోలింగ్
- ఐదు జిల్లాల్లోని ఏడు పట్టణ స్థానిక సంస్థల్లో పోలింగ్
- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం
- 138 కేంద్రాలు.. 556 కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు
- 6,831 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు
- ఫలితాలపై అధికార, విపక్షాల్లో ఉత్కంఠ

తుది అంకానికి పుర పోరు



అమరావతి, స్వర్ణసాగరం

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. నవంబరు 1న జరిగిన పోలింగ్‌లో వివాదాలు, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు వచ్చిన 13 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. దీంతో ఎన్నికల సంఘం దృష్టి ఇప్పుడు ఓట్ల లెక్కింపుపై కేంద్రీకృతమైంది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా యంత్రాంగాలు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశాయి. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. నవంబరు 1న జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో బూత్ కబ్జా, రిగ్గింగ్ వంటి ఆరోపణలు రావడంతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ 13 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ మేరకు అనంతపురం, తిరుపతి, వైఎస్సార్ కడప, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని ఏడు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 12 వార్డులకు సంబంధించిన 13 కేంద్రాల్లో సోమవారం తిరిగి పోలింగ్ నిర్వహించారు. - మిగతా 3లో

స్వర్ణసాగరం
ప్రాంతీయ తెలుగు దినపత్రిక

దీపావళికి గ్రీన్ క్రాకర్స్‌కు సుప్రీంకోర్టు ఓకే!

న్యూఢిల్లీ: దీపావళి పండుగ సందర్భంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో పర్యావరణహిత బాణాసంచా కాల్చేందుకు సుప్రీంకోర్టు పరిమిత అనుమతులు మంజూరు చేసింది. నవంబర్ 7, 8 తేదీల్లో మాత్రమే గ్రీన్ క్రాకర్స్ వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, తిరిగి రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చేందుకు అనుమతించింది. నవంబర్ 9 నుంచి బాణాసంచాపై తిరిగి పూర్తి స్థాయి నిషేధం అమల్లోకి వస్తుందని వెల్లడించింది.



నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, ఆరోగ్య కేంద్రాలు, సైలెన్స్ జోన్‌లకు 300 మీటర్ల పరిధిలో బాణాసంచా కాల్చడంపై నిషేధం విధించింది. బేరియం వినియోగించిన టపాసులతో పాటు, గ్రీన్ క్రాకర్స్‌గా ధ్రువీకరణ పొందని బాణాసంచా విక్రయాలను అడ్డుకోవాలని అధికారులను ఆదేశించింది. హండ్రెడ్ వాలా, థౌజండ్ వాలా వంటి భారీ శబ్దాలు చేసే టపాసుల వినియోగాన్ని కూడా అనుమతించబోమని స్పష్టం చేసింది.

కాలుష్యంపై నిరంతర పర్యవేక్షణ అవసరం

గతంలో జారీ చేసిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అధికారుల మధ్య సమన్వయ లోపమే ఇందుకు ప్రధాన కారణమని అభిప్రాయపడింది. పండుగ సమయంలోనే కాకుండా, ఆ తర్వాత కూడా పర్యావరణ కాలుష్యంపై నిరంతరం సమీక్ష జరగాలని సూచించింది. కేంద్ర, ఢిల్లీ కాలుష్య నియంత్రణ మండళ్ల పర్యవేక్షణ కేంద్రాల నుంచి గాలి నాణ్యత సూచీ వివరాలను సేకరించాలని ఆదేశించింది.

ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

కాలుష్యం కారణంగా ఆస్పత్రుల్లో పెరుగుతున్న రోగుల సంఖ్య, మరణాల వివరాలను ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోని ఆరోగ్య కేంద్రాల నుంచి సేకరించాలని ధర్మాసనం పేర్కొంది. పటాకుల వల్ల గాలి, శబ్ద కాలుష్యం పెరిగి చిన్నారులు, దివ్యాంగులు, వృద్ధులు సహా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రకృతిలోని పంచభూతాలను పూజించే సంస్కృతి మనదని, ఏ మతాచారమైనా ప్రకృతి పరిరక్షణకు అనుగుణంగా ఉండాలని వ్యాఖ్యానించింది.

దియామీర్జా వీడియోపై వివాదం.. తొలగించిన బీఎంసీ

మరోవైపు పర్యావరణహిత దీపావళిపై బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) రూపొందించిన ప్రచార వీడియో వివాదానికి దారితీసింది. సినీనటి దియా మీర్జా నటించిన ఈ వీడియోలో కాలుష్యానికి దూరంగా దీపావళి జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అయితే బీజేపీ నాయకుడు అమిత్ సతమ్ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీపావళి ఎలా జరుపుకోవాలో ఎవరి దగ్గరా పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో వివాదం చెలరేగడంతో బీఎంసీ తన సోషల్ మీడియా ఖాతాల నుంచి ఆ వీడియోను తొలగించింది. కాలుష్య రహిత దీపావళిపై అవగాహన కల్పించేందుకు బీఎంసీ చేపట్టిన ప్రచారంలో భాగంగానే ఈ వీడియో రూపొందించారు.

భారత వైమానిక దళానికి కొత్త అధిపతి

న్యూఢిల్లీ: భారత వైమానిక దళానికి కొత్త అధిపతిగా ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు చేపట్టారు. దేశానికి 42 ఏళ్లపాటు విశిష్ట సేవలందించిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ స్థానంలో ఆయన నియమితులయ్యారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అశుతోష్ దీక్షిత్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. భారత వైమానిక దళానికి అద్భుతమైన నాయకత్వాన్ని అందించగల సమర్థుడైన వాయు యోధుడిగా దీక్షిత్‌ను కొనియాడారు.



స్వదేశీ రక్షణ సామర్థ్యాలకు ప్రాధాన్యం

వైమానిక దళ పోరాట సంసిద్ధతను మరింత బలోపేతం చేయడం, కార్యాచరణ సామర్థ్యాలను పెంపొందించడం, స్వదేశీ రక్షణ రంగాన్ని అభివృద్ధి చేయడం తన ప్రాధాన్యతలని అశుతోష్ దీక్షిత్ స్పష్టం చేశారు. సాంకేతిక ఆవిష్కరణలు, త్రివిధ దళాల మధ్య సమన్వయానికి కూడా ప్రాధాన్యం ఇస్తానని వెల్లడించారు.

నాలుగు దశాబ్దాల విశిష్ట సేవలు

నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన అశుతోష్ దీక్షిత్ 1986 డిసెంబర్ 6న భారత వైమానిక దళ ఫైటర్ విభాగంలో చేరారు. తన సుదీర్ఘ కెరీర్‌లో కార్యాచరణ, విమాన పరీక్షలు, సామర్థ్యాల అభివృద్ధి, సంయుక్త రక్షణ వ్యవహారాలు వంటి కీలక విభాగాల్లో పనిచేశారు. నిష్ణాతుడైన ఫైటర్ పైలట్‌తో పాటు ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్, టెస్ట్ పైలట్‌గా గుర్తింపు పొందారు. మిరాజ్-2000, మిగ్ విమానాల వివిధ రకాలు, జాగ్వార్, రవాణా విమానాలను నడిపిన ఆయనకు 3,300 గంటలకు పైగా విమానయాన అనుభవం ఉంది.

వైమానిక దళ ఆధునీకరణలో కీలక పాత్ర

భారత వైమానిక దళ ఆధునీకరణలో దీక్షిత్ కీలక పాత్ర పోషించారు. జాగ్వార్, మిగ్-27 విమానాల ఆధునీకరణ ప్రాజెక్టులతో పాటు స్వదేశీ తేజస్ ఎల్‌సీఏ మార్క్-1 యుద్ధ విమానానికి ప్రారంభ, తుది కార్యాచరణ అనుమతుల ప్రక్రియలో ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించారు. మిరాజ్-2000 స్క్వాడ్రన్, బీదర్ వైమానిక స్థావరం సహా పలు కీలక విభాగాలకు నాయకత్వం వహించారు.

ఆపరేషన్ సింధూర్‌లోనూ కీలక బాధ్యతలు

సదరన్ ఎయిర్ కమాండ్‌లో ఎయిర్ డిఫెన్స్ కమాండర్‌గా, సౌత్ వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌లో సీనియర్ ఎయిర్ స్టాఫ్ ఆఫీసర్‌గా పనిచేశారు. డిప్యూటీ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్, సెంట్రల్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వంటి కీలక పదవులు చేపట్టారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చైర్మన్‌కు చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా సేవలందించారు. వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా కూడా పనిచేశారు.

పతకాలతో విశిష్ట గుర్తింపు

సైనిక సేవలకు గుర్తింపుగా అశుతోష్ దీక్షిత్‌కు 2026లో పరమ విశిష్ట సేవా పతకం, 2023లో అతి విశిష్ట సేవా పతకం, 2011లో విశిష్ట సేవా పతకం, 2006లో వాయుసేన పతకం లభించాయి. నాలుగు దశాబ్దాల అనుభవంతో ఇప్పుడు దేశ వైమానిక దళానికి నాయకత్వం వహించనున్నారు.

రోడ్డు పనుల్లో పెను విషాదం

ఝుంఝునూ: రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండగా హైటెన్షన్ విద్యుత్ తీగలు తగలడంతో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఝుంఝునూ జిల్లాలోని ఉదయ్‌పుర్‌వాటి ప్రాంతం ఛాపోలీ గ్రామంలో ఈ దుర్ఘటన జరిగింది. రోడ్డు పనుల్లో ఉపయోగిస్తున్న యంత్రం 11 వేల వోల్టుల సామర్థ్యం కలిగిన విద్యుత్ తీగలకు తగలడంతో ఈ ప్రమాదం సంభవించింది.



యంత్రానికి విద్యుత్ సరఫరా.. కుప్పకూలిన కార్మికులు

గ్రామస్థుల సహకారంతో ఛాపోలీ గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా కంకర కలిపేందుకు ప్రత్యేక యంత్రాన్ని ఏర్పాటు చేశారు. కదమ్ కుండ్ వైపు వెళ్లే రహదారిపై పనులు జరుగుతుండగా యంత్రం పైన ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో ఒక్కసారిగా యంత్రంలోకి విద్యుత్ ప్రవహించింది. సమీపంలో పనిచేస్తున్న కార్మికులు విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయారు. ప్రమాద తీవ్రతకు అక్కడివారికి స్పందించే అవకాశం కూడా లేకుండా పోయింది. సమాచారం అందుకున్న గ్రామస్థులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆస్పత్రులకు తరలించారు.

ఘటనా స్థలానికి జిల్లా కలెక్టర్

ప్రమాదం గురించి గ్రామస్థులు ఫోన్ ద్వారా సమాచారం అందించారని ఝుంఝునూ జిల్లా కలెక్టర్ అరుణ్ గార్గ్ తెలిపారు. ప్రాథమిక వివరాల ప్రకారం ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే మరణించారని వెల్లడించారు. మరో ఆరుగురిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. దీంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరిందని, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. సమాచారం అందిన వెంటనే తాను ఘటనా స్థలానికి బయలుదేరినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే భగవానారామ్ సైనీ, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కూడా ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: సీఎం

ఈ దుర్ఘటనపై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్మికులు విద్యుదాఘాతంతో మృతి చెందడం హృదయవిదారకమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

బాధ్యులెవరో తేల్చాలి: అశోక్ గహ్లోత్

మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ సైతం ఈ ఘటనపై స్పందించారు. రోడ్డు నిర్మాణ పనుల సమయంలో ఇంతటి ఘోర ప్రమాదం ఎలా జరిగిందో సమగ్రంగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి బాధ్యులెవరో గుర్తించాలని అధికారులను కోరారు. మృతుల కుటుంబాలకు తగిన పరిహారం అందించడంతో పాటు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్ఐఆర్ దెబ్బ.. ఐదు రాష్ట్రాల్లో 2.28 కోట్ల ఓట్లు మాయం!



న్యూఢిల్లీ: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రభావం ఐదు రాష్ట్రాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, పంజాబ్, మణిపుర్ రాష్ట్రాల్లో ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎస్ఐఆర్‌కు ముందు ఈ ఐదు రాష్ట్రాల్లో కలిపి 18.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా, సవరణ అనంతరం ఆ సంఖ్య 16.43 కోట్లకు పడిపోయింది. మొత్తంగా సుమారు 2.28 కోట్ల మంది ఓటర్ల పేర్లు తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

యూపీలో అత్యధికంగా తగ్గిన ఓటర్లు

ఈ ఐదు రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్‌లోనే అత్యధికంగా ఓటర్ల సంఖ్య తగ్గింది. ఎస్ఐఆర్‌కు ముందు 15.44 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్య తుది జాబితాలో 13.40 కోట్లకు చేరింది. అంటే సుమారు 2.04 కోట్ల మంది తగ్గారు. మొత్తం ఐదు రాష్ట్రాల్లో నమోదైన తగ్గుదలలో దాదాపు 90 శాతం ఉత్తరప్రదేశ్ నుంచే ఉంది. ఆ రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 13.24 శాతం తగ్గడం గమనార్హం.

అర్హులకు మరో అవకాశం

ఓటరు జాబితాలో పేర్లు గల్లంతైన అర్హులైన పౌరులు మరోసారి తమ పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ప్రస్తుతం చేపడుతున్న ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియలో భాగంగా ఈ అవకాశం ఉంటుంది. అంతేకాకుండా 2027 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే యువత కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

బీజేపీ ప్రచారం బూమరాంగ్.. దిల్లీలో యథావిధిగా మార్కెట్లు!

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఇండియా కూటమి నిర్వహించిన భారీ ర్యాలీ రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. ర్యాలీ కారణంగా నగరంలోని వ్యాపారాలు దెబ్బతింటాయని, మార్కెట్లు మూతపడతాయని బీజేపీ చేసిన ప్రచారాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఆదివారం దిల్లీలో దుకాణాలు యథావిధిగా తెరిచి ఉండటంతో పాటు వ్యాపార కార్యకలాపాలు కూడా కొనసాగాయని పేర్కొంది. బీజేపీ చేసిన ప్రచారం బెడిసికొట్టిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు.

ప్రజలను భయపెట్టే ప్రయత్నం విఫలం

ఇండియా కూటమి ర్యాలీకి ప్రజలు హాజరుకాకుండా అడ్డుకునేందుకు, కార్యక్రమం ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు అధికార పార్టీ ప్రయత్నించిందని జైరాం రమేశ్ ఆరోపించారు. రాజకీయ కార్యక్రమాల వల్ల వ్యాపారాలకు నష్టం జరుగుతుందన్న ప్రచారం అవాస్తవమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దిల్లీకి వచ్చిన ప్రజలు స్థానిక మార్కెట్లలో కొనుగోళ్లు చేయడం ద్వారా వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చారని తెలిపారు. పెద్ద వ్యాపార సంస్థలతో పాటు చిన్న దుకాణదారులు, వీధి వ్యాపారుల వద్ద కూడా కొనుగోళ్లు జరిగాయని వెల్లడించారు.

ఓటు చోరీ అంశం నుంచి దృష్టి మళ్లించేందుకే..

దేశంలో చర్చనీయాంశంగా మారిన ఓటు చోరీ ఆరోపణలు, ఎన్నికల సంఘం జవాబుదారీతనం వంటి అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీజేపీ ఈ ప్రచారానికి తెరతీసిందని జైరాం రమేశ్ ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు, ఇండియా కూటమి ర్యాలీకి ప్రజలు రాకుండా నిరుత్సాహపరిచేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిర్వహించిన కార్యక్రమానికి మద్దతు ఇస్తూనే స్థానిక ఆర్థిక వ్యవస్థకు చేయూతనిచ్చిన దిల్లీ ప్రజలు, వ్యాపారులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక వ్యాపారులకు రాహుల్ పిలుపు

ఇండియా కూటమి ర్యాలీ వల్ల వ్యాపారాలకు నష్టం వాటిల్లుతుందని పేర్కొంటూ ఓ వ్యాపారుల సంఘం రాహుల్ గాంధీకి లేఖ రాసి, ర్యాలీని వాయిదా వేయాలని కోరింది. దీనిపై స్పందించిన రాహుల్ గాంధీ.. దీపావళి సందర్భంగా దిల్లీకి వచ్చిన ప్రజలు స్థానిక వ్యాపారులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. శనివారం రాత్రి సామాజిక మాధ్యమాల ద్వారా ఈ పిలుపునిచ్చారు. పండుగ కొనుగోళ్లను స్థానిక దుకాణాల్లోనే చేయాలని కోరారు. ర్యాలీ కారణంగా వ్యాపారాలకు ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.

ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాల ప్రశ్నలు

ఆదివారం జరిగిన ఇండియా కూటమి ర్యాలీలో ప్రతిపక్ష నేతలు బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఎన్నికల సంఘం బాధ్యతలపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మొత్తంగా ర్యాలీకి ముందు బీజేపీ చేసిన ప్రచారం, అనంతరం కాంగ్రెస్ చేసిన ఎదురుదాడితో దిల్లీ రాజకీయాలు వేడెక్కాయి.

పంజాబ్‌లో ఆప్‌కు భారీ షాక్.. బీజేపీలోకి ముగ్గురు ఎమ్మెల్యేలు!

చండీగఢ్: పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2027 అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ పార్టీకి చెందిన ముగ్గురు కీలక నేతలు భారతీయ జనతా పార్టీలో చేరారు. మాజీ ఐపీఎస్ అధికారి, అమృత్‌సర్ నార్త్ మాజీ ఎమ్మెల్యే కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్‌తో పాటు హర్మీత్ సింగ్ పఠాన్‌మాజ్రా, చేతన్ సింగ్ జౌరమాజ్రా సోమవారం బీజేపీ కండువా కప్పుకున్నారు. ఇప్పటికే ఆప్ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ విమర్శలు చేస్తున్న నేతలు ఒకేసారి పార్టీ మారడం పంజాబ్ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

పార్టీ నాయకత్వంతో విభేదాలు

హర్మీత్ సింగ్ పఠాన్‌మాజ్రా పటియాలా జిల్లాలోని సనౌర్ నియోజకవర్గానికి, చేతన్ సింగ్ జౌరమాజ్రా సమానా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో ఆప్ నాయకత్వం వీరిని సస్పెండ్ చేసింది. అనంతరం ఇద్దరూ పార్టీకి రాజీనామా చేశారు. వారి శాసనసభ సభ్యత్వాలను రద్దు చేయాలని కోరుతూ స్పీకర్‌కు ఫిర్యాదు చేసేందుకు ఆప్ సిద్ధమైంది. మరోవైపు కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్ కూడా సోమవారం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను అసెంబ్లీ స్పీకర్‌కు పంపించారు. 2025 జూన్ 29న ఆప్ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఆయన అప్పటి నుంచి పార్టీ నాయకత్వం, ప్రభుత్వ విధానాలపై బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు.

'పంజాబ్ ఫస్ట్'.. విజయ్ ప్రతాప్ స్పష్టం

బీజేపీలో చేరడానికి ముందు కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్ ఎక్స్ వేదికగా అమృత్‌సర్ ప్రజలకు సందేశం ఇచ్చారు. తనకు ప్రజలు అందించిన ప్రేమ, గౌరవానికి జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పంజాబ్ ప్రస్తుతం మాదకద్రవ్యాల సమస్య, గ్యాంగ్‌స్టర్ల బెదిరింపులు, వసూళ్లు, అవినీతితో సతమతమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛమైన రాజకీయాలు, పారదర్శక పాలన అందించేందుకు ప్రజలతో కలిసి పనిచేస్తానని తెలిపారు. తనకు వ్యక్తిగత ప్రయోజనాల కంటే పంజాబ్ అభివృద్ధే ముఖ్యమని, 'పంజాబ్ ఫస్ట్' అనేదే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

స్వర్ణసాగరం
ప్రాంతీయ తెలుగు దినపత్రిక

విపత్తుల వేళ రైతుకు బీమా భరోసా

స్వర్ణసాగరం అమరావతి

ప్రకృతి విపత్తుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా పరిహారం కూడా అందేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పంట నష్టం జరిగినప్పుడు అంచనాలు రూపొందించడం నుంచి బీమా క్లెయిమ్‌ల పరిష్కారం వరకు ప్రతి దశలోనూ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కేంద్రం నుంచి వ్యవసాయ శాఖ అధికారులతో పాటు పంటల బీమా కంపెనీల ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. రైతు సేవా కేంద్రాల సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. విపత్తుల సమయంలో రైతులకు ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. దీనికి పంటల బీమా పరిహారం కూడా తోడైతే రైతులకు మరింత ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు.

బీమా ప్రయోజనాలు అందరికీ చేరాలి

రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది పెద్దఎత్తున రైతులు పంటల బీమా చేయించుకున్నారని చెప్పారు. అయితే బీమా చేయించుకోవడమే కాకుండా, నష్టం జరిగినప్పుడు క్లెయిమ్ ప్రక్రియ సక్రమంగా పూర్తయ్యేలా చూడటం కూడా ముఖ్యమన్నారు. బీమా క్లెయిమ్‌ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన పత్రాలు, నష్టాన్ని నమోదు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

కలెక్టర్లు చొరవ చూపాలి

పంట నష్టం అంచనాలు, బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఎం సూచించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, బీమా కంపెనీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రైతులు, కౌలురైతులు అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ బీమా ప్రయోజనం అందేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రకృతి విపత్తుల సమయంలో పరిహారం కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదని, ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

బీమాపై రైతుల్లో అవగాహన పెంచాలి

పంటల బీమా అనేది రైతుల వ్యవసాయ ప్రణాళికలో భాగం కావాలని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. బీమా వల్ల ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు కలిగే ఆర్థిక నష్టాన్ని కొంతవరకు తగ్గించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి సీజన్‌లో పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించాలని, అర్హతలు, నమోదు గడువులు, క్లెయిమ్ విధానం గురించి వివరించాలని అధికారులను ఆదేశించారు.

అర్నబ్ తుపానుతో పంట నష్టం

అర్నబ్ తుపాను ప్రభావంతో శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు పలు ప్రాంతాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు సీఎం తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నష్టపోయిన పంటలను గుర్తించి త్వరితగతిన అంచనాలు రూపొందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి, నష్టం వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. రైతులకు అందాల్సిన ప్రభుత్వ సాయం, బీమా పరిహారం ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

'మురసు' తుపానుపై అప్రమత్తం

మరోవైపు 'మురసు' తుపానును సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని చంద్రబాబు ఆదేశించారు. అమరావతిలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి అధికారులు, జిల్లా కలెక్టర్లతో తుపాను సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని సీఎం సూచించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు. వర్షాల వల్ల పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. పంట నష్టం జరిగిన వెంటనే వివరాలు సేకరించి పరిహార ప్రక్రియకు అవసరమైన చర్యలు చేపట్టాలని చంద్రబాబు సూచించారు.

కూటమి విజయానికి సమన్వయంతో పనిచేయాలి

సామాజిక న్యాయానికి ప్రాధాన్యమిస్తూ పుల్లమ్మకు జడ్పీటీసీ టికెట్

ఏ.కొండూరు, గంపలగూడెం, తిరువూరు రూరల్, విస్సన్నపేట మండలాల్లో ఎంపీ కేశినేని చిన్ని పర్యటన

ఐవీఆర్ఎస్ సర్వేలో పుల్లమ్మకు 64 శాతం మద్దతు వచ్చిందని వెల్లడి

ఎమ్మెల్యే, ఎంపీ మధ్య అభిప్రాయ భేదాలు సహజం.. పార్టీ నిర్ణయమే ముఖ్యం

కూటమిలో సమన్వయానికి ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టీకరణ

తిరువూరు, స్వర్ణసాగరం

అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఏ.కొండూరు, గంపలగూడెం, తిరువూరు రూరల్, విస్సన్నపేట మండలాల్లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఆయా మండలాల్లో కూటమి తరపున పోటీ చేస్తున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులతో సమావేశమై ఎన్నికల కార్యాచరణపై చర్చించారు. కూటమి అభ్యర్థుల విజయానికి సమన్వయంతో పనిచేయాలని కార్యకర్తలకు





పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గంపలగూడెం జడ్పీటీసీ అభ్యర్థిగా పుల్లమ్మకు టికెట్ కేటాయించడంపై ఎంపీ మీడియాతో మాట్లాడుతూ సామాజిక న్యాయం, పార్టీ పట్ల అంకితభావం, ప్రజాదరణకు ప్రాధాన్యత ఇచ్చి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచి, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన పుల్లమ్మ కుటుంబ సేవలను గుర్తించి అధిష్ఠానం అవకాశం కల్పించిందన్నారు. ఉద్యోగాన్ని సైతం వదులుకుని పార్టీ కోసం పనిచేసిన వారి అంకితభావాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు చెప్పారు. టికెట్ కోసం పలువురు పోటీపడినప్పటికీ స్థానిక నాయకులు త్యాగం చేసి పుల్లమ్మకు అవకాశం కల్పించారని వివరించారు. అభ్యర్థి ఎంపిక కోసం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో పుల్లమ్మకు 64 శాతం మద్దతు లభించిందని వెల్లడించారు. పార్టీ పట్ల అంకితభావం, ప్రజాదరణ, క్షేత్రస్థాయి నాయకుల అభిప్రాయాలు, సర్వే ఫలితాల ఆధారంగానే టికెట్లు కేటాయించామని తెలిపారు. ఎమ్మెల్యేకు చెక్ పెట్టేందుకే పుల్లమ్మకు జడ్పీటీసీ టికెట్ ఇచ్చారన్న ప్రచారంపై స్పందిస్తూ ఎమ్మెల్యే, ఎంపీ మధ్య చిన్నచిన్న అభిప్రాయ భేదాలు సహజమని, వాటిని పెద్దవిగా చూడాల్సిన అవసరం లేదన్నారు. వ్యక్తుల కంటే పార్టీ ప్రయోజనాలు, అధిష్ఠానం నిర్ణయమే ముఖ్యమని, ఎన్నికల సమయంలో అందరూ కలిసికట్టుగా పనిచేస్తారని స్పష్టం చేశారు. లోకేశ్ నాయకత్వంలో పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కూటమి పార్టీల మధ్య సమన్వయానికి ఎలాంటి ఇబ్బందులు లేవని, అన్ని పార్టీల నాయకులు పరస్పర సహకారంతో ఎన్నికల ప్రచారంలో ముందుకు సాగుతున్నారని తెలిపారు. నాలుగు మండలాల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తున్నారని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు.

రాప్తాడు బాలికపై దాడి.. ప్రభుత్వ వైఫల్యమే కారణం

-మొదటిపేజీ తరువాయి

పాఠశాలలో ఓ వ్యక్తి రంపంతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన బాలిక ప్రస్తుతం బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రికి వెళ్లిన జగన్ వైద్యులతో మాట్లాడి బాలికకు అందిస్తున్న చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి, కోలుకునే అవకాశాలపై ఆరా తీశారు. అనంతరం బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. రంపం వంటి ప్రమాదకరమైన ఆయుధంతో ఓ వ్యక్తి పాఠశాలలోకి ప్రవేశించి బాలికలపై దాడి చేయడం ఆందోళనకరమన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. గ్రామాలు, వీధుల్లో గంజాయి, అక్రమ మద్యం విక్రయాలు విస్తరించాయని ఆరోపించారు. మత్తుపదార్థాలు యువతకు, పిల్లలకు సులభంగా అందుబాటులోకి వస్తున్నాయని విమర్శించారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, పాఠశాలల్లోకి బయటి వ్యక్తులు ప్రవేశించకుండా భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలి:

బాలిక కుటుంబానికి కూటమి ప్రభుత్వం రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించాలని జగన్ డిమాండ్ చేశారు. బాధితురాలి వైద్య ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరించాలని కోరారు. ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందకపోతే వైఎస్సార్‌సీపీ తరపున వైద్య సహాయం అందిస్తామని, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం పరిహారం అందించకపోయినా, వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వస్తే బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు అందిస్తామని చెప్పారు. బాధిత బాలిక చిన్నాన్న వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తి, మండల కన్వీనర్‌గా ఉన్నారని జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని ఆరోపిస్తూ, గత 15--16 నెలల్లో ఇలాంటి ఘటనలు తొమ్మిది చోటుచేసుకున్నాయని వ్యాఖ్యానించారు. గ్రామాల్లో మద్యం, గంజాయి విక్రయాలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అయితే ఈ ఆరోపణలపై ప్రభుత్వ స్పందనను కథనంలో చేర్చాల్సి ఉంది. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు సానుకూలంగా స్పందించారని జగన్ తెలిపారు. దేవుడి దయతో బాలిక త్వరగా కోలుకుంటుందని వైద్యులు చెప్పడం కొంత ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలని, కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందించాలని మరోసారి ప్రభుత్వాన్ని కోరారు.

ఎన్నికల అక్రమాలపై కోర్టుకెళ్తాం.. ఎస్ఈసీ తీరుపై జగన్ ధ్వజం

స్వర్ణసాగరం తాడేపల్లి

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సింది పోయి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తొత్తుగా వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా పులివెందులలో జరిగిన ఘటనలు ఎన్నికల సంఘం పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల అక్రమాలపై న్యాయపోరాటం కొనసాగిస్తామని, ఆలస్యమైనా చివరకు న్యాయం, ధర్మమే గెలుస్తాయని స్పష్టం చేశారు.

70 బూత్‌లలో అక్రమాలు జరిగాయంటూ..

పులివెందులలో మొత్తం 80 పోలింగ్ బూత్‌లు ఉండగా, 70 చోట్ల వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను అడ్డుకున్నారని జగన్ ఆరోపించారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన టీడీపీ కార్యకర్తలు పోలీసుల, ఎన్నికల అధికారుల సహకారంతో తమ పార్టీ ఏజెంట్లపై దాడులకు పాల్పడ్డారని విమర్శించారు. కొన్నిచోట్ల ఏజెంట్లను బలవంతంగా పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు పంపించారని పేర్కొన్నారు. ఓటర్ల నుంచి స్లిప్పులు లాక్కోవడం, బూత్‌లను ఆక్రమించడం, రిగ్గింగ్, సైక్లింగ్‌కు పాల్పడటం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఆధారాలు తమ వద్ద ఉన్నాయని వెల్లడించారు.

రీపోలింగ్‌పై అభ్యంతరం

70 పోలింగ్ కేంద్రాల్లో అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు చేసినప్పటికీ, ఎన్నికల సంఘం కేవలం నాలుగు బూత్‌లలో మాత్రమే రీపోలింగ్‌కు ఆదేశించడంపై జగన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ పార్టీ ఏజెంట్లు నేరుగా తన సమక్షంలోనే అధికారులకు ఫిర్యాదులు చేశారని, ఏజెంట్ ఫారాలను చూపిస్తూ నిరసన తెలిపారని గుర్తుచేశారు. ఇన్ని ఘటనలు జరిగినా ఎన్నికల సంఘం తీసుకున్న చర్యలు కంటితుడుపుగా ఉన్నాయని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరిగాయని ఎలా చెప్పగలమని ప్రశ్నించారు.

రాష్ట్రవ్యాప్తంగా అక్రమాలు జరిగాయని ఆరోపణ

పులివెందులకే పరిమితం కాకుండా కడప, అనంతపురం, తిరుపతి, కర్నూలు, చిత్తూరు, ఒంగోలు, గుంటూరు, నెల్లూరు, విశాఖపట్నం, విజయవాడ కార్పొరేషన్లతో పాటు మాచర్ల, చిలకలూరిపేట, వినుకొండ, జమ్మలమడుగు, నంద్యాల, చీమకుర్తి, గిద్దలూరు, ఎమ్మిగనూరు, సూళ్లూరుపేట, పలాస, డోన్, నాయుడుపేట, నందిగామ, జగ్గయ్యపేట, కుప్పం, పుత్తూరు, పార్వతీపురం తదితర ప్రాంతాల్లోనూ ఎన్నికల అక్రమాలు చోటుచేసుకున్నాయని జగన్ ఆరోపించారు.

నేడే.. కౌంటింగ్

-మొదటిపేజీ తరువాయి

ఉదయం 7 గంటలకు ప్రారంభమైన రీపోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, పోలీసులు పర్యవేక్షణ చేపట్టారు. ముఖ్యంగా వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, జమ్మలమడుగు, పల్నాడు జిల్లాలోని మాచర్ల వంటి కీలక ప్రాంతాల్లో రీపోలింగ్ జరగడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

కౌంటింగ్‌కు భారీ ఏర్పాట్లు

రీపోలింగ్ పూర్తవడంతో మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 13 నగరపాలక సంస్థల కోసం 22, మిగిలిన మున్సిపాలిటీలు, నగర పంచాయతీల కోసం 116 కలిపి మొత్తం 138 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 556 కౌంటింగ్ హాళ్లు, 6,831 కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేశారు. ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు సహాయకులను నియమించడంతో పాటు అవసరమైన అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

ముందుగా పోస్టల్ బ్యాలెట్లు

మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించిన అనంతరం బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. వార్డుల వారీగా ఓట్లను వేరు చేసి, అభ్యర్థుల వారీగా లెక్కిస్తారు. ప్రతి రౌండ్ పూర్తయిన తర్వాత సంబంధిత వివరాలను నమోదు చేసి, అధికారిక ప్రక్రియ ప్రకారం ఫలితాలను ప్రకటించనున్నారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేశారు.

కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత:

కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలతో నిఘా ఉంచనున్నారు. గుర్తింపు కార్డులు కలిగిన అభ్యర్థుల ఏజెంట్లను మాత్రమే నిబంధనల ప్రకారం కౌంటింగ్ హాళ్లలోకి అనుమతించనున్నారు. అనుమతి లేని వ్యక్తులు కేంద్రాల పరిసరాల్లోకి రాకుండా చర్యలు చేపట్టారు. ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవాలు, ర్యాలీల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు సూచించారు.

60.96 శాతం పోలింగ్ నమోదు:

నవంబరు 1న రాష్ట్రవ్యాప్తంగా 92 పట్టణ స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల్లో సుమారు 60.96 శాతం పోలింగ్ నమోదైంది. 13 మేయర్ పదవులు, 70 మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులతో పాటు కార్పొరేషన్లలో 804 డివిజన్లు, మున్సిపాలిటీల్లో 2,382 వార్డులకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రీపోలింగ్ జరిగిన కేంద్రాల్లో నమోదైన ఓట్లతో కలిపి అభ్యర్థుల భవితవ్యం మంగళవారం తేలనుంది.

కూటమి, వైఎస్సార్‌సీపీకి కీలకం:

రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో ఈ ఫలితాలకు రాజకీయంగా ప్రాధాన్యం ఏర్పడింది. అధికార కూటమితో పాటు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ కూడా ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ప్రజల మద్దతు ఎవరికి లభించిందనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మేయర్, చైర్‌పర్సన్ పదవులతో పాటు డివిజన్లు, వార్డుల వారీగా గెలుపోటములపై ఉత్కంఠ కొనసాగుతోంది. మంగళవారం వెలువడనున్న ఫలితాలతో పట్టణ స్థానిక సంస్థల్లో ఎవరి ఆధిపత్యం ఎంతన్నది స్పష్టం కానుంది.

ప్రతి మండలంలో కూటమి జెండా ఎగరాలి

-మొదటిపేజీ తరువాయి

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు కీలక పాత్ర పోషిస్తాయని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాలనూ కూటమి కైవసం చేసుకోవాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకోసం జెడ్పీటీసీ స్థానాల్లో అత్యధిక విజయాలు సాధించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రతి మండలంలోనూ కూటమి బలాన్ని చాటాలని, ఎంపీటీసీ స్థానాల్లోనూ పైచేయి సాధించాలని స్పష్టం చేశారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కేంద్రంలో, రాష్ట్రంలో, స్థానిక సంస్థల్లోనూ ఎన్డీఏ ప్రభుత్వమే ఉంటే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని చంద్రబాబు అన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించామని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ఎన్నికల్లో కూటమికి మరింత మద్దతు లభిస్తుందని అభిప్రాయపడ్డారు.

కూటమి పార్టీల మధ్య సమన్వయం ముఖ్యం

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. కూటమి స్ఫూర్తికి అనుగుణంగా ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహంపై తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ నిరంతరం చర్చించుకుంటున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలోనూ మూడు పార్టీల నాయకులు ఒకే మాటపై నిలబడి, ఉమ్మడి లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సమన్వయంతో వ్యవహరించి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాలని సూచించారు.

పోలింగ్ శాతం పెంచాలి:

ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదవడంపై చంద్రబాబు ప్రస్తావించారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం అధిక శాతం పోలింగ్ నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూటమికి మద్దతుగా ఉన్న ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పార్టీ నాయకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఓటర్లకు ఎన్నికల తేదీలు, పోలింగ్ కేంద్రాల వివరాలు తెలియజేస్తూ చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల రోజున ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా క్షేత్రస్థాయిలో కార్యాచరణ ఉండాలని స్పష్టం చేశారు.
పులివెందుల ఘటనపై నేతలకు అభినందనలు: పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరగడంపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. పులివెందులలో హింసాత్మక ఘటనలకు కొందరు ప్రయత్నించినప్పటికీ కూటమి నాయకులు సంయమనం పాటించారని అభినందించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. త్వరలో జరగనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలోనూ పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ పరిణామాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.
ఒకవైపు ఎన్నికల సన్నాహాలు కొనసాగుతుండగా, మరోవైపు 'అర్నబ్', 'మురసు' తుపానుల ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను ప్రభుత్వం సమర్థంగా చేపడుతోందని చంద్రబాబు తెలిపారు. తుపానుల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ చేపట్టి, విద్యుత్ సరఫరాను తిరిగి సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.
రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నవంబరు 5న జరగనుండగా, నవంబరు 7న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారం, ఓటర్ల సమీకరణ, పోలింగ్ నిర్వహణ, కౌంటింగ్ ప్రక్రియపై కూటమి పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి.


swarna sagaram_Swarna sagaram.qxd 11/2/2026 10:50 PM Page 1

చీకటి మయం..వీధి దీపాలు కరువు!

వీధి దీపాలు లేక అంధకారంలో నేలపట్టు గ్రామం.. ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

దొరవారిసత్రం,స్వర్ణసాగరం,నవంబర్02:

దొరవారిసత్రం మండల పరిధిలోని నేలపట్టు గ్రామంలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో గ్రామమంతా చీకటిమయంగా మారుతోంది. వీధి దీపాలు వెలగకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించే ప్రజలు, వృద్ధులు, మహిళలు చీకట్లో నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు.గ్రామంలోని పలు వీధుల్లో సరైన వెలుతురు లేకపోవడంతో ప్రజలు రాత్రి వేళ బయటకు రావాలంటేనే ఆందోళన చెందుతున్నారు. అత్యవసర పనుల నిమిత్తం వెళ్లేవారు సైతం చీకట్లోనే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. వీధి దీపాల నిర్వహణపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.ప్రజలకు కనీస మౌలిక సదుపాయమైన వీధి దీపాలను ఏర్పాటు చేసి, పనిచేయని దీపాలకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





ఇప్పటికైనా నేలపట్టు గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలోని వీధులన్నింటిలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.ప్రజల ఇబ్బందులను అధికారులు గుర్తించి సమస్యకు తక్షణ పరిష్కారం చూపుతారా ? అనేది వేచి చూడాలి.

RNI : APTEL/26/A2367 OFFICE : 9440352036
SWARNA SAGARAM TELUGU DAILY
స్వరసాగరం
తిరుపతి తెలుగు దినపత్రిక
చిత్తూరు | నెల్లూరు | అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

గ్లాస్ గుర్తు కి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న సోమశేఖర్ నాయుడు

ప్రచార కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రజలు

ఐరాల,స్వర్ణ సాగరం నవంబర్ :2

ఐరాల మండలం స్థానిక ఎన్నికల ప్రచారంలో భాగంగా గుండ్లపల్లి సెగ్మెంట్ అభ్యర్థి ఆక పరమశివయ్య జోరు ప్రచార కార్యక్రమం. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన లక్ష్యమని పరమశివయ్య తెలియజేస్తున్నారు. అలాగే కూటమి జెడ్పిటిసి జనసేన అభ్యర్థి మహేష్ స్వేరో గ్లాస్ గుర్తుపై మీ అమూల్యమైన ఓట్లను వేయాలని తెలియజేశారు. ఈ నెల 5వ తేదీ గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పోలింగ్‌లో ఎంపీటీసీ గ్లాసు గుర్తుపై ఒక ఓటు జడ్పిటిసి గ్లాస్ గుర్తుకు ఒక ఓటు వేసి కూటమి నాయకులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు మోతుకూరి సోమ శేఖర్ నాయుడు తెలియ జేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులను అఖండ విజయంతో గెలిపించి అభి వృద్ధికి సహకరించాలని ప్రతి ఓటర్లను కోరి తెలియజేశారు. గ్రామాల్లో ప్రచారానికి వెళితే ప్రజలు అడుగడు గున బ్రహ్మ





రథం పడుతూ ఘన స్వాగతం పలుకుతున్నారు. పరమశివయ్య ప్రజలతో మాట్లాడుతూ మీకు సేవ చేసే అవకాశం నాకు కల్పించండి అని ఓటర్లకు తెలియజేశారు. పూతలపట్టు నియోజకవర్గం కూటమి నాయకులు, తదితరులు ప్రచార పాల్గొన్నారు.

సర్వేపల్లి లో టిడిపి క్లీన్ స్వీప్

వరిగొండ 1 ప్రాదేశిక ప్రచారంలో రాజగోపాల్ రెడ్డి



తోటపల్లి గూడూరు నవంబర్ 2

సర్వేపల్లి లో జడ్పిటిసి ఎంపీటీసీల ఎన్నికల్లో భాగంగా టిడిపి క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని సర్వేపల్లి నియోజకవర్గ టిడిపి సమన్వయ నేత సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారుసోమవారం మండలంలోని వరిగొండ 1ప్రాదేశిక నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించారుఈ సందర్భంగా మాట్లాడుతూ తోటపల్లి గూడూరు జడ్పిటిసి జానార జినిఎం పీటీసీపేరం శోభారాణి ని ఎన్నికలలో గెలిపించాల్సిందిగా కోరారు.కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న సంక్షేమం అభివృద్ధి గమనించిన ప్రజలుటిడిపి వైపుఆకర్షితులవుతున్నారని తెలిపారుఈ ప్రచారంలోటిడిపి మండల అధ్యక్షులు కొణతం రఘు బాబు టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర స్థానిక టిడిపి నేత విజయ డైరీ డైరెక్టర్ కోదూరు శ్రీనివాసులు రెడ్డిఅభ్యర్థులు స్థానిక నేతలు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

వాకాడు కేంద్రంలోని బిట్ 1 లో తెలుగు దేశం పార్టీ ముమ్మర ఎన్నికల ప్రచారం

వాకాడు 1 సెగ్మెంట్లోని పలు కాలనీలో ఇంటింటి ప్రచారం

జడ్పిటిసి అభ్యర్థి సన్నారెడ్డి అనితమ్మ ఎంపీటీసీ అభ్యర్థి బత్తిన ప్రమీలను గెలిపించాలంటూ ప్రచారం

ప్రజా అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం లక్ష్యం అంటూ ప్రచారం







స్వర్ణసాగరం వాకాడు

వాకాడు మండల కేంద్రంలోని బిట్ 1 సెగ్మెంట్ పరిధిలో తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, పాపారెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, కాటంరెడ్డి రామలింగారెడ్డి, చంద్రభూషన్ రెడ్డి ల ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం కార్యక్రమంలో నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ జడ్పిటిసి అభ్యర్థి సన్నారెడ్డి అనితమ్మ, ఎంపీటీసీ అభ్యర్థి బత్తిన ప్రమీల ను బంగ్లా సెంటర్,టెంకాయ తోపు, కొత్త హరిజనవాడ,పాత హరిజనవాడ, కాలనీలలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ ఓటర్లను కలిశారు.కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమలను దృష్టిలో పెట్టుకుని సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీ గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ బాలసుబ్రమణ్యం, కిషోర్ రెడ్డి,కొండయ్య, రాజేష్, రమేష్, చింటూ,మస్తానయ్య, అమీర్ భాష,మేరా మొహిద్దిన్, రహంతుల్లా, సురేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

జోరు వానలో కూటమి ప్రచారం

మనుబోలు స్వర్ణ సాగరం

మనుబోలు మండలం లోని కటో వపల్లి కొలనుకుదురు సెగ్మెంట్ ఎంపీటీసీ కూటమి అభ్యర్థి తూపిలి వెంకయ్య జోరు వానలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు కూటమితోనే అభివృద్ధి సాధ్యమని కూటమి అభ్యర్థిని గెలిపించాలని గ్రామంలో హోరెత్తించారు మధు రెడ్డి అల్లా బాషా సునీల్ రెడ్డి నిఖిల్ రెడ్డి సునీల్ రెడ్డి మహేంద్ర మల్లి రెడ్డి టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

కొండాపురం సెగ్మెంట్ లోని కాశీపురం జాండ్రపేట గ్రామాల్లో వైసీపీ పార్టీ విస్తృతస్థాయి ఎన్నికల ప్రచారం

వైసిపి నాయకులు ఏనుగు సుధాకర్ నాయుడు, వేమిరెడ్డి రవి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం

ఎంపీటీసీ అభ్యర్థి దాన శ్రీనివాసులు జెడ్పిటిసి అభ్యర్థి ముప్పాల సుధాలక్ష్మి గెలిపించాలంటూ ప్రచారం

వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి,సంక్షేమం ప్రజలకు గుర్తు చేస్తూ ప్రచారం

వానను సైతం లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారం





స్వర్ణసాగరం వాకాడు

మండల పరిధిలోని కొండాపురం సెగ్మెంట్లోని కాశీపురం, జాండ్రపేట గ్రామాల్లో వైసీపీ పార్టీ క్షేత్రస్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం వైసీపి పార్టీ నాయకులు ఏనుగు సుధాకర్ నాయుడు కాశీపురం వైసీపీ నాయకులు వేమిరెడ్డి రవి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వానను సైతం లెక్కచేయకుండా విస్తృత స్థాయి ప్రచారం నిర్వహించారు.ఈ ప్రచారంలో ఎంపీటీసీ అభ్యర్థి దాన శ్రీనివాసులు,జడ్పిటిసి అభ్యర్థి ముప్పాల సదాలక్ష్మి అఖండ మెజార్టీతో గెలిపించాలంటూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు చేసిన అభివృద్ధి సంక్షేమం ప్రజలకు గుర్తు చేస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచక పాలను ఎండగట్టాలంటే వైసీపీ పార్టీని గెలిపించాలాటు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాశీపురం ఉప సర్పంచ్ కోటపూడి శ్రీనివాసులు, జాండ్రపేట నాయకులు ఉప్పల శ్రీనివాసులు, కోసూరు బాలయ్య, దాన నాగయ్య,పారి వెంకటయ్య,విజయ్, శివ, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రవీంద్రపురం గిరిజన కుటుంబాలకు పునరావాస కేంద్రం



తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం నవంబర్ 2

"ముసురు" తీవ్ర తుఫాన్ దృష్ట్యా తీరప్రాంత వాసులనుతరలించే క్రమంలో మండలంలోని రవీంద్రపురం ప్రాంతాలలో జీవనం సాగిస్తున్న 75 కుటుంబాలనుమహాలక్ష్మిపురం లోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలించారుఈ శిబిరంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు వీఆర్వోలు లక్ష్మయ్య రవి దర్శనితెలిపారుతీర ప్రాంత వాసులను తరలించే విషయంలో రెవిన్యూ పోలీస్ శాఖలు సమన్వయం చేసుకుంటూ ముందుకు పోతున్నారు

చిత్తూరు నగరపాలక సాధారణ ఎన్నికలు - కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

పీవీకేఎన్ కళాశాలలో నేడు ఓట్ల లెక్కింపు



స్వర్ణ సాగరం పూతలపట్టు నవంబర్ 2

చిత్తూరు నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికలు 2026 కు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎన్నికల సంఘం, ఎన్నికల అధికారి, కలెక్టర్ గారి ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నగరపాలక అదనపు ఎన్నికల అధికారి, కమిషనర్ పి నరసింహ ప్రసాద్ తెలిపారు. చిత్తూరు పీవీకేఎన్ కళాశాలలో మంగళవారం ఉదయం 8.00గం. నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు.

ఎం. పైపల్లి సెగ్మెంట్ ఫ్యాన్ గుర్తు అభ్యర్థి కే.పద్మ ప్రచార కార్యక్రమం

కే. పద్మ కు మద్దతుగా ప్రచారం నిర్వహించిన సమన్వయకర్త డాక్టర్ ఎం సునీల్ కుమార్





ఐరాల స్వర్ణ సాగరం నవంబర్ :2

ఐరాల మండలం ఎం. పైపల్లెలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం జోరు.ఎం. పైపల్లె గ్రామంలో గడప గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిని కె. పద్మ ని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేసిన పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఎం. సునీల్ కుమార్ .ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మమేకమై పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరుతూ, స్థానిక సమస్యలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతూ సాగిన ఈ ప్రచార కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రజల ఆశీస్సులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి బలమైన పునాది అని డాక్టర్ సునీల్ కుమార్ తెలియజేశారు . ఈ ప్రచార కార్యక్రమంలో మండలంలోని వైఎస్ఆర్ పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఫ్లాగ్ మార్చ్‌లు ప్రజలతో పోలీసుల ముఖాముఖి

బంగారుపాళ్యం,స్వర్ణసాగరం,నవంబర్ 2

బంగారుపాళ్యం మండలంలో లోకల్ బాడీ ఎలక్షన్స్ సందర్భంగా కాటప్పగారిపల్లి,పాలేరు, అండారెడ్డిపల్లి మరియు బంగారుపాళ్యం దళిత వాడలో సున్నితమైన ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం జరిగింది ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించాము ఎన్నికల సందర్భంగా ఎవరైనా గొడవలకు దిగడం, ప్రత్యర్థులపై దాడులకు పాల్పడడం బెదిరింపులకు దిగడం,రెచ్చగొట్టడం, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని పోలీసులు



ప్రజలను కఠినంగా హెచ్చరిస్తున్నారు. ఎన్నికల హింసకు పాల్పడినా,శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగకుండా తమ



ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎన్నికలకు సంబంధించిన సమస్యలు లేదా అవాంఛనీయ ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించాలని బంగారుపాళ్యం అర్బన్ పోలీస్ స్టేషన్ సీఐ కత్తి శ్రీనివాసులు

swarna sagaram_Swarna sagaram.qxd 11/2/2026 10:50 PM Page 2

కమిషనర్ కనుసన్నల్లోనే భూ దందా

అక్రమ రిజిస్ట్రేషన్ల లీలలపై చర్యలు తీసుకోకుంటే ఉద్యమం తప్పదు!

మున్సిపల్ కమిషనర్ నిర్వాకంపై ప్రజావాణిలో బీజేపీ ఫిర్యాదు

స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా నవంబర్ 02

హుజూర్‌నగర్ పట్టణంలో భూ దందా కోసం ఒకే స్థలానికి రెండు ఎన్‌వోసీలు జారీ చేసి అక్రమ రిజిస్ట్రేషన్లకు సహకరించిన మున్సిపల్ కమిషనర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు రాతపూర్వక వినతిపత్రం అందజేశారు.పట్టణంలోని సర్వే నంబర్ 281లో మొత్తం 12.33 ఎకరాల ఆర్ఎస్ఆర్ భూమి రికార్డుల్లో నమోదై ఉందని, అయితే అక్రమ రిజిస్ట్రేషన్ల కోసం రికార్డులను తారుమారు చేస్తూ





కమిషనర్ ఉద్దేశపూర్వకంగా సహకరించారని బీజేపీ నాయకులు ఆరోపించారు.ఒకే దరఖాస్తుకు రెండు వేర్వేరు ఎన్‌వోసీలు ఎలా జారీ చేశారో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కమిషనర్ ఇచ్చిన తప్పుడు ఎన్‌వోసీల కారణంగా ఒకరి భూమిని నిషేధిత జాబితా (ప్రోహిబిటెడ్ లిస్ట్)లో ఉంచి,దేవాదాయ భూముల ఆక్రమణలకు,అక్రమ రిజిస్ట్రేషన్ల కు దారి తీశారని మండి పడ్డారు .అక్రమాలకు పాల్పడిన మున్సిప ల్ కమిషనర్‌పై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోక పోతే బీజేపీ ఆధ్వర్యంలో పట్టణ వ్యాప్తం గా పెద్ద ఎత్తున నిరసన ందో ళనలు చేపడతామని హెచ్చరిం చారు. బీజేపీ హుజూర్‌నగర్ పట్ట ణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్, జిల్లా నాయ కులు బెల్లంకొండ నరేష్,కంటు నాగరాజు, కొప్పెర సాయిరాం, విజయ్,చిలకరాజు సైదులు, నరేష్,గొట్టే వెంకట్ యాదవ్,నాగరాజు పాల్గొన్నారు.

నాగంవాండ్లపల్లి సెగ్మెంట్ అభ్యర్థి విమల ప్రచార కార్యక్రమం

విమల కు మద్దతుగా ప్రచారం నిర్వహించిన పూజారి మోహన్ రెడ్డి



ఐరాల స్వర్ణ సాగరం నవంబర్ :2

ఐరాల మండలం నాగం వాండ్లపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్షంలో ఎన్నికల ప్రచారం జోరు. నాగం వాండ్లపల్లి, వడ్డేపల్లి, గ్రామంలో గడప గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిని విమల ని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేసిన పూతలపట్టు నియోజకవర్గం వైఎస్ఆర్ పార్టీ సీనియర్ నాయకులు పూజారి మోహన్ రెడ్డి, ఐరాల మండలం వైఎస్ఆర్ పార్టీ కన్వీనర్ బుజ్జీ రెడ్డి, గణేష్ ప్రసాద్ రెడ్డి .ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మమేకమై పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరుతూ, స్థానిక సమస్యలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతూ సాగిన ఈ ప్రచార కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రజల ఆశీస్సులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి బలమైన పునాది అని పూజారి మోహన్ రెడ్డి తెలియజేశారు . ఈ ప్రచార కార్యక్రమంలో మండలంలోని వైఎస్ఆర్ పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి తాసిల్దార్ రమాదేవి

మనుబోలు స్వర్ణ సాగరం



మురసు తుఫాన్ దృష్టి జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు మనుబోలు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసిల్దార్ రమాదేవి సూచించారు సోమవారం ఆమె స్థానిక మీడియాతో మాట్లాడుతూ తుఫాన్ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇళ్ల నుండి బయటికి రాకుండా సురక్షితంగా ఉండాలని సూచించారు ఎవరైనా పాడు పడ్డ ఇళ్లలో నివసిస్తుంటే వారు వెంటనే వేరే బంధువుల ఇళ్లకు పోయి క్షేమంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు తమ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేసి ఉన్నామని అన్నారు అదేవిధంగా పశువులు మేత కూడా రెండు రోజులపాటు వెళ్ళవద్దని సూచించారు ముఖ్యంగా తీర ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు రెండు మూడు రోజులపాటు వర్షాలు ఉండే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆర్ఐ అరుణ్ కుమార్, డిజిటల్ అసిస్టెంట్ సాయి, వీఆర్వో నాగార్జున్ రెడ్డి, మరియు రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు

సిపిఎం నేత కాల్తి రెడ్డి 27వ వర్ధంతి

మల్లికార్జునపురంలో ఘనంగా నివాళులర్పించిన నేతలు అభిమానులు



తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం నవంబర్ 2

మండలంలోని మల్లికార్జునపురం గ్రామానికి చెందిన సిపిఎం నేత పేద వర్గాలకు ఆపద్బంధువు వామపక్ష భావజాలం జీర్ణించుకున్న కాల్టి రెడ్డి రమణయ్య27వ వర్ధంతి అభిమానులు బంధువులు పార్టీ కార్యకర్తలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఆయన స్తూపానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. నివాళులు అర్పించిన వారిలో ఐక్య పోరాట కమిటీ అధ్యక్షులువేగూరు వెంకయ్య కాల్టి రెడ్డి రమణమ్మ పచ్చ మధు స్థానిక నేతలు అభిమానులు పాల్గొన్నారు

విజయమే లక్ష్యంగా సైకిల్ గుర్తు కి మద్దతుగా ప్రచారం

ప్రచార కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రజలు





ఐరాల,స్వర్ణ సాగరం నవంబర్ :2

ఐరాల మండలం స్థానిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నాగం వాండ్లపల్లి సెగ్మెంట్ సైకిల్ గుర్తు అభ్యర్థి జ్ఞాన సంధ్యారాణి జోరు ప్రచార కార్యక్రమం. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన లక్ష్యమని తెలియజేస్తున్నారు. అలాగే కూటమి జెడ్పిటిసి జనసేన అభ్యర్థి మహేష్ స్వేరో గ్లాస్ గుర్తుపై మీ అమూల్యమైన ఓట్లను వేయాలని తెలియజేశారు. ఈ నెల 5వ తేదీ గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పోలింగ్‌లో ఎంపీటీసీ సైకిల్ గుర్తుపై ఒక ఓటు జడ్పిటిసి గ్లాస్ గుర్తుకు ఒక ఓటు వేసి కూటమి నాయకులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు మోతుకూరి సోమశేఖర్ నాయుడు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులను అఖండ విజయంతో గెలిపించి అభివృద్ధికి సహకరించాలని ప్రతి ఓటర్లను కోరి తెలియజేశారు. ముందుగా జ్ఞాన సంధ్యారాణి వీరభద్ర స్వామి ఆలయంలో అభిషేకం నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు అందుకుని అనంతరం సోమవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు,గ్రామాల్లో ప్రచారానికి వెళితే ప్రజలు అడుగడుగున బ్రహ్మ రథం పడుతూ ఘన స్వాగతం పలుకుతున్నారు, జ్ఞాన సంధ్యారాణి ప్రజలతో మాట్లాడుతూ మీకు సేవ చేసే అవకాశం నాకు కల్పించండి అని ఓటర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గం కూటమి నాయకులు, తదితరులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



పెళ్లకూరు స్వర్ణసాగరం నవంబర్ 2

మండలంలోని రోసనూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం చెంబెడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చంద్రమోహన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాక్షికంగా లేదా పూర్తిగా శ్వాసనాళం మూసుకుపోయినప్పుడు ప్రాణాపాయ స్థితిని నివారించేందుకు అత్యవసర ప్రథమ చికిత్సగా 'హైమ్లిక్ మాన్యువర్' కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ విషయంపై డాక్టర్ చంద్రమోహన్ పాఠశాల విద్యార్థులకు ఒక ప్రత్యేక అవగాహన చేశారు. ఈమాన్యువర్ ఏ కండిషన్లలో చేయాలి? ఆహారం లేదా ఇతర వస్తువులు గొంతులో అడ్డుపడి శ్వాస ఆడకపోవడం, దగ్గలేకపోవడం, చర్మం నీలం రంగులోకి మారడం లేదా వ్యక్తి స్పృహ కోల్పోయే ప్రమాదం ఉన్నప్పుడు ఈపద్ధతిని వెంటనే ఉపయోగించాలని చెప్పారు.వివిధ వయసుల వారికి ఎలా చేయాలి? పెద్దవారికి, చిన్నపిల్లలకు, శిశువులకు ఎలా చేయాలి, సొంతంగా ఎలా చేసుకోవాలి అనే అంశాలపై డాక్టర్ ట్రైనింగ్ ఇచ్చారు. ప్రథమ చికిత్సపై ప్రాథమిక జ్ఞానం ఉండడం వల్ల అత్యవసర సమయంలో ప్రాణాలను కాపాడుకోవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు, హెల్త్ అసిస్టెంట్ హరి, సుస్మిత, విజయ కుమారి, ఆశ సుగుణ పాల్గొన్నారు.

కనిగిరి మండల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

-- జడ్పీటీసీ అభ్యర్థి మల్లెల ప్రవీణ్ కుమార్

బడుగులేడు పంచాయతీ విస్తృత ప్రచారం



కనిగిరి స్వర్ణ సాగరం నవంబర్ 02

కనిగిరి మండల జడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లెల ప్రవీణ్ కుమార్ మండలంలోని బడుగులేరు పంచాయితీ లో పట్టాభిరాంపురం మరియు గానుగపెంట ల్లో మరియు బొమ్మిరెడ్డిపల్లి మరియు బాడుగలేరు పర్యటించి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. గ్రామాల్లో స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మల్లెల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ ప్రాదేశిక ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనను జడ్పీటీసీగా గెలిపిస్తే కనిగిరి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.ముఖ్యంగా గ్రామాల్లో రహదారుల సమస్యలు, డ్రైనేజీ కాలువలు, తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మండల పార్టీ అధ్యక్షుడు కస్తూరి రెడ్డి మరియు సిద్ధారెడ్డి మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ విభాగాల పదవుల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

బోడబండ్ల సెగ్మెంట్లో జోరుగా వైయస్ఆర్సీపీ ఎంపీటీసీ అభ్యర్థిని అఖిలావతి ఎన్నికల ప్రచారం



బంగారుపాళ్యం,స్వర్ణసాగరం,నవంబర్ 2.

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెం మండలంలోని బోడబండ్ల ఎంపీటీసీ సెగ్మెంట్లో వైయస్సార్సీపి అభ్యర్థిని అఖిలావతి ఎన్నికల ప్రచారం జోరుగా ఉపందుకుంది.అఖిలావతి విద్యావంతురాలు బిటెక్ విద్యార్థి కావడంతో పంచాయతీలలో మంచి అభివృద్ధి చెందుతుందని బోడబండ్ల,కాటప్పగారిపల్లి పంచాయతీలలో ఎంపిటిసి అభ్యర్థి పి.అఖిలావతికి మంచి ఆదరణ లభిస్తుంది తనను మంచి మెజార్టీతో గెలిపిస్తే బోడబండ్ల సెగ్మెంట్లోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తానని అఖిలావతి ఓటర్లను కోరుకుంటున్నారు అలాగే ఈ నెల 5 వ తేదీ జరగబోవు ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మంచి మెజారిటీతో గెలిపించాలని అఖిలావతి ఓటర్లను కోరుతున్నారు

కాకాని నోరు అదుపులో పెట్టుకో ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు స్వర్ణ సాగరం





కాకాని నోరు అదుపులో పెట్టుకోవాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి హెచ్చరించారు సోమవారం ఆయన మనుబోలు మండలం లోని కాగితాలపూరు లక్ష్మీనరసింహాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారానికి విచ్చేశారు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఎంపిటిసి గోను మహాలక్ష్మమ్మకు జడ్పిటిసి పొట్టేల ప్రసాద్ సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు అదేవిధంగా కొండూరు సత్రం కి చెందిన వైసీపీ నాయకుడు గుంటి శేఖర్ టిడిపి పార్టీలో చేరడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు తాను దేవుడు భూములు కాజేశానని కాకాని ఆరోపించారని మా బతుకులు అవి కాదని ఆస్తులు అమ్ముకున్న వాళ్ళమని జిల్లాలో ప్రతి ఒక్కరికి తెలుసని పేర్కొన్నారు గిరిజనుల భూములు కల్తీ మద్యం అమ్ముకున్న ఘనత కాకాని దేనని విమర్శించారు కాకానిలా నాది నీచమైన బతుకు కాదని ఎద్దేవా చేశారు దేగపూడి బండేపల్లి కాలువ పనులు అపిన ఘనత కాకాని విమర్శించారు పొదలకూరులో మెగా వాటర్ ప్లాంట్ కట్టించామన్నారు నిమ్మ మార్కెట్ కట్టించామన్నారు చెక్ డ్యాములు నిర్మించామన్నారు నాపై మా కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు మానుకొని రాజకీయ విమర్శలు చేయాలని సూచించారు సర్వేపల్లి లో ప్రతి మండలం నుండి టిడిపి కండువాలు కప్పుకుంటున్నారని వైసిపి ఖాళీ అవుతుందని ఎద్దేవా చేశారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య వేడిచర్ల వెంకటరమణ రెడ్డి మధు నాయుడు సునీల్ కృష్ణమ నాయుడు మనుబోలు నీటి సంఘ అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి, కిరణ్, గోను దశయ్య సుబ్బయ్య నరసింహ బండి కట్టు రవి టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

వ్యవసాయ కళాశాల భూసేకరణ బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం



12వ వార్డు కౌన్సిలర్ అమరరాపు ప్రవీణ్

ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగాల హామీలను తక్షణమే అమలు చేయాలి

పరిహారం చెల్లింపులు, సర్వేపై సమగ్ర విచారణకు డిమాండ్

పార్టీలకు అతీతంగా రైతులకు మద్దతుగా నిలిచిన పలువురు కౌన్సిలర్లు

స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా నవంబర్ 02

హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో వ్యవసాయ కళాశాల నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణలో భూములు కోల్పోయిన బాధిత రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని 12వ వార్డు కౌన్సిలర్ అమరరాపు





ప్రవీణ్ స్పష్టం చేశారు. సర్వే నంబర్ 1041 పరిధిలోని బాధిత రైతులతో కలిసి పలువురు కౌన్సిలర్లు సమావేశమై సమస్యలపై చర్చించారు.భూసేకరణ సమయంలో బాధిత రైతులకు చట్టబద్ధమైన నష్టపరిహారంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, అర్హులైన కుటుంబాల పిల్లలకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు ఆ హామీలు అమలు కాలేదని ప్రవీణ్ తెలిపారు. తమకు రావాల్సిన హక్కుల కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం దారుణమన్నారు. భూసేకరణ ప్రక్రియ, భూముల సర్వే వివరాలు, నష్టపరిహారం చెల్లింపుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై అధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.భూసేకరణ పరిధిలోకి వచ్చిన భూముల వివరాలు, ఇప్పటివరకు పరిహారం పొందిన రైతుల జాబితా, పెండింగ్‌లో ఉన్న బకాయిలు, అర్హులైన లబ్ధిదారుల వివరాలను బహిరంగంగా, పారదర్శకంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీలను లిఖితపూర్వకంగా నమోదు చేసి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఈ సమస్య ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, బాధిత కుటుంబాల మనుగడ, హక్కులకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు రైతులకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. అఖిలపక్ష ఐక్యతతోనే బాధితులకు న్యాయం సాధించగలమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ శీలం శ్రీను నాగమణి, 7వ వార్డు కౌన్సిలర్ వల్లపు నాగరాజు, 15వ వార్డు కౌన్సిలర్ నలగొట్ల శ్రీనాథ్ (చంటి) సుజాత, 16వ వార్డు కౌన్సిలర్ చిట్టిపోతుల రమేష్‌లతో పాటు సర్వే నంబర్ 1041 పరిధిలోని బాధిత రైతులు పాల్గొన్నారు.

swarna sagaram_Swarna sagaram.qxd 11/2/2026 10:50 PM Page 3

ఎస్ఐని సస్పెండ్ చేసి 29వ వార్డులో రీపోలింగ్ నిర్వహించాలి

డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు.. సమగ్ర విచారణకు డిమాండ్

ఎస్సై ఏకపక్ష ధోరణి పై నిరసన

-- కనిగిరి స్వర్ణ సాగరం నవంబర్ 02

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డులో ఆదివారం జరిగిన పోలింగ్ సందర్భంగా పోలీసుల వ్యవహారశైలిపై సీపీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ, తమ పార్టీ అభ్యర్థి, కార్యకర్తల పట్ల పక్షపాత ధోరణి ప్రదర్శించిన కనిగిరి పట్టణ ఎస్ఐను తక్షణమే సస్పెండ్ చేయాలని, 29వ వార్డులో జరిగిన ఎన్నికను రద్దుచేసి రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టి, కనిగిరి డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు అందజేశారు.ఈ సందర్భంగా సీపీఎం కనిగిరి పట్టణ కమిటీ కార్యదర్శి, 29వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పోలిచర్ల కేశవరావు తన ఫిర్యాదులో



పలు తీవ్ర ఆరోపణలు చేశారు. మున్సిపాలిటీలోని 32 వార్డులకు గాను 30 వార్డుల్లో ఏకగ్రీవాలు జరగ్గా 6, 29వ వార్డులలో మాత్రమే ఎన్నిక నిర్వహించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. నవంబర్ 1న పోలింగ్ సందర్భంగా తమ పార్టీ అభ్యర్థి అయిన తనతోపాటు, ఏజెంట్ల పట్ల పట్ల ఎస్ఐ వ్యవహరించిన తీరు దౌర్జన్యకరంగా ఉందన్నారు.పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న తమ పార్టీ అభ్యర్థి, కార్యకర్తలను బలవంతంగా అక్కడి నుంచి పంపించడమే కాకుండా, గృహ నిర్బంధానికి గురిచేశారని ఆరోపించారు. మహిళా కార్యకర్తలని కూడా చూడకుండా దురుసుగా ప్రవర్తించారని, మరోవైపు అధికార పార్టీకి చెందిన వారికి ఎలాంటి ఆటంకాలు లేకుండా స్వేచ్ఛ కల్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ కొందరికి అనుకూలంగా వ్యవహరించడం ద్వారా పోలింగ్ ప్రక్రియపై ప్రభావం చూపారని ఆరోపించారు.పోలింగ్ సందర్భంగా జరిగిన పరిణామాలు, పోలీసుల వ్యవహారశైలిపై సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని కోరారు. ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగేలా చూడాల్సిన పోలీసులే పక్షపాత ధోరణితో వ్యవహరించడం తీవ్ర అభ్యంతరకరమన్నారు.ఈ ఘటనపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సంబంధిత ఎస్ఐను విధుల నుంచి సస్పెండ్ చేయాలని, సమగ్ర విచారణ జరిపించాలని, 29వ వార్డు ఎన్నికను రద్దుచేసి పారదర్శకంగా రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. తమ ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోవాలని ,కనిగిరి ఎన్నికల అధికారిని,డీఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, నరేంద్ర,ప్రసంగి ,నాగ రాజు,కాసయ్య,మల్లికార్జున , చంటి,శ్రీను, వెంకట మ్మ,శాంతకుమారి, రుఫియా, ఆదిలక్ష్మి, రత్తమ్మ,రమణ మ్మ , మల్లేశ్వరి, లాల్బీ, ఎలిషమ్మ,ప్రమీల తదితరులు పాల్గొన్నారు

కూటమిలో ప్రజాస్వామ్యం కూని

వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాల సోమశేఖర్ రెడ్డి...

పెళ్లకూరు స్వర్ణసాగరం నవంబర్ 2

కూటమి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, ప్రజలకు భద్రత కరువైందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాల సోమశేఖర్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి భార్య ప్రభావతమ్మతో కలిసి కప్పగుంట కండ్రిగ, దిరసనమాల, జంగాలపల్లి, పెరుమాళ్ళపల్లి, అనక వోలు, కలవకూరు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి గడపగడపకు వెళ్లి కరపత్రాలు అం దించి జడ్పిటిసి సభ్యుడు సత్యనారాయణ రెడ్డి, పాలచురు ఎంపీటీసీ సభ్యురాలు పాలూరు రత్నమ్మ, కలవకూరు ఎంపీ టీసీ సభ్యుడు బండి బాలచంద్ర లకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గడిచిన రెండున్నరేళ్ళ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి శూన్యమని రాష్ట్రంలో మారణకాండ మితిమీరి పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు



నిర్వహించాల్సిన పాలకులు , ఓడిపోతాము అనే భయంతో పోలీసులను అడ్డం పెట్టుకుని టిడిపి గుండాల చేత దౌర్జనా య లకు పాల్పడడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రజలకు మేలు చేసినప్పుడు గెలిచే దమ్ము పాలకులకు ఉంటుందన్నారు. కానీ కూటమి నాయకులంతా అధికారాన్ని అడ్డం పెట్టుకొని స్వర్ణ ముఖి నదిలో ఇసుక, చెరువుల్లో గ్రావెల్, ప్రభుత్వ భూముల్లో మట్టి దోచేసుకోవడం తప్ప ప్రజలకు ఒక్క మంచి పని చేయ లేదని ఆరోపించారు. కూటమి నాయకులకు తొత్తులుగా మారిన పోలీసులు కాకి చొక్కాలు తీసి రౌడీలుగా మారిపోవ డం దుర్మార్గమన్నారు. ప్రతి నెల జీతాలు పుచ్చుకుంటూ శాం తి భద్రతలను కాపాడాల్సిన పోలీసులు రౌడీలను ప్రోత్సహిం చడం భావి తరానికి ఎలాంటి మార్గదర్శకత్వం ఇస్తున్నారో ఒక్కసారి ఆలోచన చేయాలని హితువు పలికారు. పోలీసులు చేసే దుశ్చర్యల వల్ల వారి కుటుంబాల్లోని పిల్లల సైతం సమా జానికి విరోధులుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిం



చారు. ఇప్పటికైనా పోలీసులు తమ కర్తవ్యాన్ని గుర్తించుకోవా లని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వెల్లడించారు. అక్రమ కేసులు పెట్టి సత్యనారాయణ రెడ్డిని అన్యాయంగా జిల్లా కేంద్ర కారాగారంలో నిర్బంధించడం మంచిది కాదన్నారు. రాష్ట్రాన్ని రావణకాష్టగ మార్చుతున్న చంద్రబాబుకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వివరించారు. ఓటర్లందరూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజారిటీతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం, మాజీ జెడ్పిటిసి సభ్యురాలు నందం ప్రిస్కిల్లా, మాజీ వైస్ ఎంపీపీ ఇలకా సుధారాణి, బైనా మల్లికార్జున్ రెడ్డి, పాలూరు దశరథరామిరెడ్డి, కాటంరెడ్డి రాధారెడ్డి, కరణం రఘు నాయుడు, దువ్వూరు సతీష్ రెడ్డి, పగడాల హరిబాబు రెడ్డి, పెళ్లూరు కార్తీక్ రెడ్డి, ముని కృష్ణయ్య, వీర రాఘవులు, మురళి, గురవయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి పట్టణ ప్రజలు మూరసు తుఫాన్ పట్ల అప్రమత్తం ఉండాలి





కనిగిరి స్వర్ణ సాగరం నవంబర్ 02

మూరాసు తుఫాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మునిసిపల్ కమీషనర్ పి.శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా కమీషనర్ శ్రీధర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాతావరణశాఖ వారి సూచనల మేరకు శ్రీయుత జిల్లా కలెక్టర్ ఉ మేజిస్ట్రేట్ ఎం. విజయ సునీత మరియు గౌరవ శాసన సభ్యులు శ్రీ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి వారి ఆదేశాలనుసారం కనిగిరి మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు 24 గంటల పాటు పనిచేసే ప్రత్యేక కంట్రోల్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. తుఫాను కారణంగా త్రాగునీటి సరఫరా, విద్యుత్ అంతరాయం, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా మున్సిపల్ శానిటేషన్ మరియు ఇంజనీరింగ్ సిబ్బందిని అప్రమత్తం చేసి అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తుఫాను ప్రభావం ఉన్నంత వరకు మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తారని భరోసా ఇచ్చారు. కనిగిరి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఎదురైతే మునిసిపల్ ఏర్పాటు చేసిన 24 గంటల ప్రత్యేక కంట్రోల్ పాయింట్ ఫోన్ 8125626457, 8186085586 నెంబర్ ను సంప్రదించాలన్నారు. మూరాసు తుఫాన్ ముందస్తు నివారణ చర్యలు, అత్యవసర సహాయక చర్యలు చేపట్టుటకు జేసీబీ, ట్రాక్టర్లు, 20 మంది మునిసిపల్ కార్మికులు అందుబాటులో ఉంటారన్నారు. కనిగిరి పుర‌ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప గృహాలను విడిచి బయటకు రాకూడదని కమీషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నేడే కనిగిరి మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు

కనిగిరి స్వర్ణ సాగరం నవంబర్ 02



కనిగిరి పురపాలక సంఘ పరిధిలోని 6వ మరియు 29వ వార్డులకు సంబంధించి జరిగిన రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు--2026 ఓట్ల లెక్కింపు రేపు అనగా 03-11-2026వ (మంగళవారం) తేదీన కంభం రోడ్డులోని ఏ.ఎం.సి. మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించబడుతుందని కమీషనర్ ఉ అసిస్టెంట్ ఎన్నికల అధికారి పి.శ్రీధర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించబడుతుం దన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ప్రవేశించే అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు మరియు వారి ఏజెంట్లు క్రింది వస్తువులను వాటర్ బాటిళ్లు, అగ్గిపెట్టెలు, సిగరెట్ తదితర నిషేధిత వస్తువులు తీసుకురాకూడదని తెలిపారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా మరియు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు మరియు భద్రతా సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించవలసిందిగా కోరడమైనది.

సర్వేపల్లిని దోపిడీకి అడ్డాగా మార్చిన కాకాణి

సోమిరెడ్డి ఘాటు విమర్శలు

స్థానిక ఎన్నికల్లో దుర్మార్గాలకు చరమగీతం పాడి అభివృద్ధికి పట్టం కట్టాలి

టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్ రెడ్డితో పాటు 19 మంది ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి



స్వర్ణ సాగరం పొదలకూరు, నవంబర్ 2

పరిషత్ ఎన్ని కల ప్రచారంలో భాగంగా సోమవా రం పొదలకూరు మండలం విరువూ రులో నిర్వహించిన ప్రచార కార్యక్ర మంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులపై ఆయ న తీవ్రస్థా యిలో విమర్శలు గుప్పిం చారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గతంలో ఎంతోమంది హేమాహేమీలు ఎమ్మెల్యేలుగా పనిచేశారని, కాకాణి గోవర్ధన్ రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాతే సర్వేపల్లి దుర్మార్గాలకు నెలవుగా మారిందని సోమిరెడ్డి ఘాటుగా విమర్శించారు. పొదలకూరు ప్రాంత ప్రజల ఓట్లతో రాజకీయంగా ఎదిగిన కాకాణి, ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టకుండా ప్రభుత్వ, ప్రైవేటు భూములను కాజేయడం, ఇతరుల మైనింగ్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని దోపిడీకి పాల్పడటమే ఆయన సాధించిన ఘనత అంటూ ఆరోపించారు. విరువూరులో దేవుడి భూములను ఆక్రమించినసురేష్ కుమార్ రెడ్డి వైసీపీ తరపున జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, విచారణ జరిపి ఆక్రమణకు గురైన దేవుడి భూములను తిరిగి స్వాధీనం చేసుకుని దేవుడికి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో అనర్హులకు పట్టాలు మంజూరు చేశారని, దీనిపై విచారణ జరిపించి అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుం టామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇలాంటి దుర్మార్గాలకు ప్రజలు తమ ఓటుతో చరమగీతం పాడాలని, అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టాలని సోమిరెడ్డి పిలుపునిచ్చారు. టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్ రెడ్డితో పాటు పొదలకూరు మండలంలోని 19 మంది ఎంపీటీసీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

కిరమంద ఎంపిటిసి అభ్యర్థి రవి ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం రాష్ట్ర పాలపకిరి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు



బంగారుపాలెం,స్వర్ణసాగరం, నవంబర్ 2

బంగారుపాళ్యం మండల పరిధిలోని కిరమంద ఎంపీటీసీ అభ్యర్థి రవి ని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని కిరమంద మాజీ ఎంపీటీసీ,రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు సోమవారం కిరమంద ఎంపిటిసి సెగ్మెంట్ పరిధిలోని కిరమంద వేపనపల్లి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అమలుపరుస్తూ రాష్ట్ర అభివృద్ధి చేస్తున్నారని గతంలో ఎవరు ఇవ్వలేని అన్ని పెన్షన్లు మంజూరు చేస్తున్నారని మహిళలకు ఉచిత బస్సు ద్వారా ఉపాధి కల్పిస్తున్నారని కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి పనులను చూసి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కిరమంద ఎంపీటీసీ అభ్యర్థి రవిని భారీ మెజారటితో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బండ్లదొడ్డి బాబు,అన్బు, కిరమంద మాజీ సర్పంచ్ బాబు,బి సుబ్రహ్మణ్యం,మణి,రాధాకృష్ణ, ఇతేంద్ర,గురువిందల లక్ష్మీనారాయణ,రత్నం,హరి,సాలివాహన, మోహనబాబు,శ్రీధర్, జనసేన పార్టీ గంగరాజు,తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

మురసు తుఫాను ప్రభావంతో విద్యుత్ శాఖ అప్రమత్తం

పొదలకూరు విద్యుత్ ఏ.ఈ.రఘు



స్వర్ణలిసాగరంపొదలకూరునవంబర్ 2

మురసు తుఫాను ప్రభావంతో వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టారు. విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తూ ఎక్కడైనా సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసు కుంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు సిబ్బందిని అప్రమత్తం చేశారు. తుఫాను సమయంలో ప్రజలు విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరా యం ఏర్పడితే ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

ప్రభుత్వ రంగ ధర్మల్ కేంద్రానికి జాతీయ పురస్కారం, ప్రశంసా పత్రం



ముత్తుకూరు ,నవంబర్ 2(స్వర్ణ సాగరం)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగ విద్యుత్ కేంద్రం ఏపీ జెన్కోకు జాతీయ పురస్కారం తోపాటు ప్రశంసా పత్రం లభించింది. ఈ విషయాన్ని ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ మధుసూదన్ రావు సోమవారం వెల్లడించారు. ధర్మల్ కేంద్రంలోని వ్యర్థాలు నిర్వహణ ప్రక్రియలో అత్యుత్తమ ప్రతిభ చూపినందుకు జాతీయ పురస్కారం వచ్చినట్లు పేర్కొన్నారు. గోవాలో జరిగిన కౌన్సిల్ ఆఫ్ ఎన్విరో ఎక్స్ లెన్స్ కార్యక్రమంలో నేషనల్ వేస్ట్ మేనేజ్మెంట్ సమ్మిట్ అండ్ అవార్డు కార్యక్రమంలో సీఈఏ సలహా మండలి సభ్యులు పంకజ్ బాత్రాఅందజేశారని పేర్కొన్నారు. బూడిద నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన వ్యర్థాలు నిర్వహణకు విధివిధానాలు అమలు చేయడం పట్ల ప్రాముఖ్యత కలిగిన పురస్కారం పొందినట్లు చీఫ్ ఇంజనీరు పేర్కొన్నారు.

తుఫాను ప్రభావంతో 27 మందికి పునరావాసం.



ముత్తుకూరు, నవంబర్ 2 (స్వర్ణ సాగరం)

తుఫాను ప్రభావంతో 27 మంది గిరిజనులకు ప్రభుత్వ అధికారులు సోమవారం పునరావాసం కల్పించారు. పైనం పురం పంచాయతీ పరిధిలోని కట్టమీద గిరిజన కాలనీ లో ఉన్న ఏడు కుటుంబాలలోని సభ్యులను దిబ్బ మీద దళితవాడలోని విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ కు తరలించి వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి జాగ్రత్తగా ఉండాలని పోలీస్ శాఖ తో పాటు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు చెప్పినారు. ప్రభుత్వ అధికారులు చర్య పట్ల గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ స్వప్న, ఎస్సై జేపీ శ్రీనివాసరెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

swarna sagaram_Swarna sagaram.qxd 11/2/2026 10:50 PM Page 4

ఇంటింటా ప్రచారంలో...కాకాణి పూజిత.



ముత్తుకూరు, నవంబర్ 2(స్వర్ణసాగరం)

స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం ప్రక్రియలో సోమవారం సాయంత్రం రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత రెడ్డి ముత్తుకూరు గ్రామపంచాయతీ పరిధిలోని బలిజ పాలెం గ్రామంలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, స్థానిక నాయకులు ఈదురు రాంప్రసాద్ రెడ్డి, ఈదురు శ్రీనివాసులు రెడ్డి, జిల్లా మహిళా విభాగం కార్యదర్శి దువ్వూరు హరిక రెడ్డి, మాజీ ఎంపీపీ సుగుణ, కార్యకర్తలు ఉన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో విజయోత్సవాలు కనబడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దేవా రెడ్డి అశోక్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కుందాంలో టీడీపీ అభ్యర్థి భాగ్యమ్మకు మద్దతుగా భాస్కర్ గౌడ్ విస్తృత ప్రచారం

అత్తివరం సెగ్మెంట్ అభివృద్ధికి కృషి చేస్తాం..

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఓజిలి(స్వర్ణ-సాగరం)నవంబర్ 02:

ఓజిలి మండలం అత్తివరం ఎంపీటీసీ సెగ్మెంట్ పరిధిలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఇందులో భాగంగా సోమవారం కుందాం గ్రామంలో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి చెంబేటి భాగ్యమ్మకు మద్దతుగా భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఓటర్లను కలిసి సైకిల్ గుర్తుపై ఓటు వేసి భాగ్యమ్మను గెలిపించాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ అత్తివరం సెగ్మెంట్ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులుగా నిరంతరం అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.అనంతరం ఎంపీటీసీ అభ్యర్థి చెంబేటి భాగ్యమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను మండల ప్రజా పరిషత్ సమావేశాల్లో ప్రస్తావించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.పదవిని హోదాగా కాకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావిస్తానని, యువత, మహిళలు, బడుగు బలహీన వర్గాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. రానున్న ఎంపీటీసీ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనకు మద్దతు అందించాలని ఓటర్లను కోరారు.ఈ ప్రచార కార్యక్రమం లో భాస్కర్ గౌడ్,శేఖర్ రెడ్డి తదితర టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.ద

పాదర్తి హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పున్నేపల్లిలో వైసీపీ ఎన్నికల ప్రచారం

గ్రద్దగుంట ఎంపీటీసీ అభ్యర్థి కటకం కిరణ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం



ఓజిలి(స్వర్ణ-సాగరం)నవంబర్ 02:

తిరుపతి జిల్లా ఓజిలి మండలం గ్రద్దగుంట ఎంపీటీసీ సెగ్మెంట్ పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. మండల వైసీపీ అధ్యక్షుడు పాదర్తి హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పున్నేపల్లి, కొత్తపేట గ్రామాల్లో పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి కటకం కిరణ్ విస్తృతంగా పర్యటించి ఓటర్లను కలుసుకున్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.ప్రచారంలో భాగంగా గ్రామాల్లోని ప్రజలతో మమేకమైన కటకం కిరణ్.. స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రద్దగుంట సెగ్మెంట్ ప్రజల తరపున నిరంతరం పనిచేస్తూ, వారి సమస్యలను మండల ప్రజా పరిషత్ సమావేశాల్లో ప్రస్తావిస్తానని తెలిపారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం,వీధి దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాల్లో భాగస్వామినవుతానని పేర్కొన్నారు. యువత, మహిళలు, బడుగు బలహీన వర్గాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో అమలైన సంక్షేమ పథకాలను గుర్తుచేస్తూ, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనకు అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు.ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు పాదర్తి హరినాథ్ రెడ్డి, అరవ భూమి రాజారెడ్డి,వేణురెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కోగిలి పంచాయతీలో కూటమి అభ్యర్థి చెంగయ్యకు ప్రజానీరాజనం





హారతులతో అడుగడుగునా ఘన స్వాగతం

ఇంటింటా వెల్లువెత్తిన ప్రజా ఆదరణ

గొల్లపాలెం నుంచి పేరంటాల్లమిట్ట వరకు పసుపుమయమైన ప్రచారం

మంగళహారతులతో కూటమి నాయకులకు ప్రజల బ్రహ్మరథం

అభివృద్ధికి మరో అవకాశం ఇవ్వండి రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తాం కూటమి అభ్యర్థి హామీ

స్వర్ణసాగరం చిట్టమూరు

కోగిలి పంచాయతీలో కూటమి ప్రభుత్వం బలపరిచిన ఎంపీటీసీ అభ్యర్థి కమతం చెంగయ్యకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా కోగిలి టీడీపీ నాయకులు రషీద్ సాహెబ్ ఆధ్వర్యంలోొల్లపాలెం,పేరంటాల్లమిట్ట,కోగిలి,సోమసముద్రం గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారానికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ముఖ్యంగా మహిళలు అడుగడుగునా హారతులు పట్టి ఆహ్వానిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఆయా గ్రామాల్లో ఎక్కడ చూసినా పసుపు జెండాలు,కూటమి నాయకుల సందడి కనిపించగా,మహిళలు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ప్రతి ఇంటి వద్ద ఎంపీటీసీ అభ్యర్థికి లభించిన ఆదరణతో కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. అదేవిధంగా చర్చిలో పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి బాటలు వేసిందని రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి కంటే రెట్టింపు స్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తామని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన,ప్రజా సమస్యల పరిష్కారం,సంక్షేమ పథకాల అమలుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.నాలుగు గ్రామాల్లోనూ కనిపించిన ప్రజా స్పందన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రచారానికి లభిస్తున్న ఆదరణ చూస్తుంటే కోగిలి పంచాయతీలో కూటమి అభ్యర్థుల విజయంపై తమకు ధీమా పెరిగిందని కూటమి శ్రేణులు పేర్కొన్నారు. ప్రజల ఆదరణే తమ విజయానికి బలమని నాయకులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వామనరాజు ఆధ్వర్యంలో వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి గౌసున్నీస ఎన్నికల ప్రచారం

ప్రజా సమస్యలపై పోరాటమే నా ప్రథమ ప్రాధాన్యం

ఆర్మేనుపాడు సెగ్మెంట్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తా: గౌసున్నీస



ఓజిలి(స్వర్ణ-సాగరం)నవంబర్ 02:

ఆర్మేనుపాడు సెగ్మెంట్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి గౌసున్నీసకు మద్దతుగా వామన రాజు ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గుర్రంకొండ ప్రాంతంలో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఓటర్లను కలిసి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గౌసున్నీసను గెలిపించాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా గౌసున్నీస మాట్లాడుతూ.. సెగ్మెంట్ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలను మండల ప్రజా పరిషత్‌లో వినిపిస్తానని స్పష్టం చేశారు.ప్రజాప్రతినిధి పదవిని హోదాగా కాకుండా సేవా బాధ్యతగా భావిస్తానని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని పేర్కొన్నారు. యువత, మహిళలు, బడుగు బలహీన వర్గాల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ సెగ్మెంట్ సమగ్ర అభివృద్ధికి పాటుపడతానని హామీ ఇచ్చారు.గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తుంచు కోవాలని కోరారు. నవతరానికి అవకాశం కల్పిస్తూ తనను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని గౌసున్నీస విజ్ఞప్తి చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో నరేంద్ర రాజు,సుకుమార్ రాజు, అజంతుల్లా తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గజ్జల నారాయణమ్మను గెలిపించండి: రాంప్రసాద్ రాజు పిలుపు

రాంప్రసాద్ రాజు ఆధ్వర్యంలో చిల్లమానుచేను ఎంపీటీసీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం



ఓజిలి(స్వర్ణ-సాగరం)నవంబర్ 02:

చిల్లమానుచేను సెగ్మెంట్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి గజ్జల నారాయణమ్మను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని యల్లంరాజు రాంప్రసాద్ రాజు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో సెగ్మెంట్ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ నారాయణమ్మకు మద్దతుగా ప్రచారం చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా యల్లంరాజు రాంప్రసాద్ రాజు మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలో నిలిచిన గజ్జల నారాయణమ్మకు ప్రజలు అండగా నిలవాలని కోరారు.సెగ్మెంట్ అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిచ్చే అభ్యర్థికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నారాయణమ్మను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం అభ్యర్థి గజ్జల నారాయణమ్మ మాట్లాడుతూ..చిల్లమానుచేను సెగ్మెంట్ పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనకు చొరవ చూపుతానన్నారు. ప్రజల సమస్యలను మండల ప్రజా పరిషత్‌లో ప్రస్తావిస్తూ వారి గొంతుకగా నిలుస్తానని స్పష్టం చేశారు .ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిని అవుతానని, పదవిని హోదాగా కాకుండా సేవ చేసే బాధ్యతగా భావిస్తానని పేర్కొన్నారు. మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ సెగ్మెంట్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు.గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాజీ ము ఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో అమలైన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తుం చుకోవాలని కోరుతూ, రానున్న ఎంపీటీసీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపిం చాలని నారాయణమ్మ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రామమూర్తి రాజు,వెంకటేష్ రాజు ,వెంకటరమణ రాజు, మురిగేష్,శ్రీనివాసులు తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీ ప్రసన్నకు పట్టం కట్టండి.

.ఓజిలిలో వెంకటసుబ్బ యాదవ్ వరప్రసాద్ నాయుడు విస్తృత ప్రచారం

ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లకు విజ్ఞప్తి...ఓజిలిలో టీడీపీ ఎన్నికల ప్రచార జోరు..



ఓజిలి(స్వర్ణ-సాగరం)నవంబర్ 02:

ఎంపీటీసీ ఎన్నికల వేళ ఓజిలి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పార్టీ బలపరిచిన అభ్యర్థి మైలాం లక్ష్మీ ప్రసన్నను భారీ మెజారిటీతో గెలిపించాలనే లక్ష్యంతో మండల టీడీపీ అధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కంకణాల సత్యవర ప్రసాదరావు ప్రచార బాధ్యతలను ముందుండి నడిపించారు. సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలోని ఇళ్లకు వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ మద్దతు కోరారు.ఈ సందర్భంగా పాడి వెంకటసుబ్బయ్య యాదవ్, కంకణాల సత్యవర ప్రసాదరావు మాట్లాడుతూ.. గ్రామ ప్రజల సమస్యలపై అవగాహన కలిగిన అభ్యర్థి లక్ష్మీ ప్రసన్నకు అవకాశం కల్పిస్తే స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తారని పేర్కొన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఆమెను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులకు నూతన పింఛన్లు అందించడం నుంచి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన వరకు అనేక అంశాలపై దృష్టి సారించిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహకారంతో ఓజిలి గ్రామ అభివృద్ధికి మరింత కృషి చేసే అవకాశం టీడీపీ అభ్యర్థికి కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు.ప్రచారంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తూ పార్టీ విధానాలను, అభ్యర్థి విజయానికి సహకరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఖలీల్ భాషా, షేక్ రఫీ బాషా, ఏఎంసీ డైరెక్టర్ కాటూరు కోటేశ్వరరావు, పాడి ధనంజయ, ముమ్మడి సుధాకర్, ముమ్మడి శ్రీను, అందలమాల రవి, ఓజిలి వెంకటయ్య, నన్నూరు నాగరాజు, పండ్లూరు హేమంత్, ఓజిలి మణి, అఖిలాష్, ఓజిలి వెంకయ్య, నన్నూరు వెంకటేశ్వర్లు, ఓజిలి పెంచలయ్య, ఓజిలి నవీన్, సిద్ధపురెడ్డి చెంచయ్య, రాయి వాసు, ఖాదర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

swarna sagaram_Swarna sagaram.qxd 11/2/2026 10:50 PM Page 5

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా శ్రీహరి గెలుపు కోసం ఆరణి దిలీప్ రెడ్డి ప్రచారం

కురుగొండలో వైసీపీ ఎన్నికల ప్రచారానికి యంగ్ అండ్ డైనమిక్ లీడర్ మద్దతు

శ్రీహరికి ఒక్క అవకాశం ఇవ్వండి.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటాం

ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించండి వైసీపీ నాయకుల విజ్ఞప్తి



ఓజిలి(స్వర్ణ-సాగరం)నవంబర్ 02:

వర్షం కురుస్తున్నా వెనుకడుగు వేయకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీరామ్ శ్రీహరి విజయమే లక్ష్యంగా ఆ పార్టీ యంగ్ అండ్ డైనమిక్ లీడర్ ఆరణి దిలీప్ రెడ్డి కురుగొండ సెగ్మెంట్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీహరికి మద్దతుగా ప్రచారంలో పాల్గొని పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపారు. ప్రతికూల వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజల మధ్యకు వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించడం స్థానికంగా రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.తిరుపతి జిల్లా ఓజిలి మండలం కురుగొండ ఎంపీటీసీ సెగ్మెంట్ పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రచారంలో ఆరణి దిలీప్ రెడ్డి, వైసీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామ్ శ్రీహరికి ఒక్క అవకాశం కల్పించాలని, ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన సేవలందిస్తారని పేర్కొన్నారు.గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యాయని నాయకులు గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో స్థానికంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. రహదారులు, తాగు నీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిర ంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఎన్నికల్లో గెలుపొందిన అనంతరం ప్రజలకు అందు బాటులో ఉంటూ వారి సమస్య లను ఎప్పటికప్పుడు తెలుసు కుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రాధాన్యత అని భరోసా ఇచ్చారు.ప్రచార కార్యక్రమంలో భాగంగా సుమారు 1,500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లారు.నవంబర్ 5న జరగనున్న ఎంపీటీసీ ఎన్నికల్లో ఓటర్లు తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి శ్రీరామ్ శ్రీహరిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆరణి దిలీప్ రెడ్డి, వైసీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో దిలీప్ కుమార్ రెడ్డి,ఎం. రవీంద్ర రెడ్డి,శివారెడ్డి,ఎం.అనిల్ కుమార్ రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.'

నెల్లిపూడి సెగ్మెంట్ లోని వెంకట్ రెడ్డి పాలెం లో ఎంపీటీసీ అభ్యర్థి దువ్వూరు జనార్దన్ రెడ్డి ఎన్నికల ప్రచారం







స్థానిక నాయకులు ఎంబెట్టి పోలయ్య ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ

పసుపు మయంగా మారిన వెంకటరెడ్డి పాలెం

సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలంటూ పిలుపు

స్వర్ణసాగరం వాకాడు

మండలం లోని నెల్లిపూడి సెగ్మెంట్ పరిధిలోని వెంకటరెడ్డి పాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి దువ్వూరు జనార్దన్ రెడ్డి, పాపారెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి,స్థానిక నాయకులు ఏంభేటీ పోలయ్య ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా తెలుగు దేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు స్థానిక ప్రజలు జనార్దన్ రెడ్డి కి మహిళలు మంగళ హారతులు పట్టి పూలవర్షం కురిపిస్తూ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం జనార్దన్ రెడ్డి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ ఓటర్లను సైకిల్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సంక్షేమం అమలుచేస్తూ ప్రజలకు ఎంతో మేలు చేసిందని రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి మరింత రెట్టింపు స్థాయిలో చేస్తామని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి సమస్యలు పరిష్కరిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరీష్ నాయుడు, కృష్ణమోహన్ రెడ్డి, గంగాధర్ రెడ్డి,కుంభాల రమణయ్య, పోలయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి కటికల వెంకట రత్నంను గెలిపిద్దాం

వైసీపీ సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ గుంటక తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం.....







కనిగిరి స్వర్ణ సాగరం నవంబర్ 02

వెలిగండ్ల మండలం వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థి కటికల వెంకట రత్నం కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని మాజీ జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో వెలిగండ్ల మండలంలోని పలు గ్రామాలల్లో జోరుగా ఎన్నికలు ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ వైసీపీ అభ్యర్థి కటికల వెంకట రత్నం కు మద్దతుగా ప్రచారం చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ గుంటక తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలో నిలిచిన కటికల వెంకట రత్నం కు ప్రజలు అండగా నిలవాలని కోరారు.వెలిగండ్ల మండలం అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిచ్చే అభ్యర్థికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం జడ్పీటీసీ అభ్యర్థి కటికల వెంకట రత్నం మాట్లాడుతూ వెలిగండ్ల మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనకు చొరవ చూపుతానన్నారు. ప్రజల సమస్యలను మండల ప్రజా పరిషత్‌లో ప్రస్తావిస్తూ వారి గొంతుకగా నిలుస్తానని స్పష్టం చేశారు.ప్రజలకు నిత్యం అందుబా టులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిని అవుతానని, పదవిని హోదాగా కాకుండా సేవ చేసే బాధ్యత గా భావిస్తానని పేర్కొన్నారు. మహి ళలు, యువత, బడుగు బలహీన వర్గాల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు ప్రయత్నం చేస్తాన న్నారు.గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో అమలైన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తుంచుకోవాలని కోరుతూ, రానున్న జడ్పీటీసీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నూతన గూడెంలో కూటమి నేతల ఆత్మీయ కలయిక

మాజీ డీసీసీబీ చైర్మన్ కారటం రాంబాబు ను సత్కరించినశాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి



పోలవరం స్వర్ణ సాగరం ప్రతినిధి అశోక్

పోలవరం మండలం పాత నూతన గూడెం గ్రామంలో జనసేన నాయకుల ఆత్మీయ కలయిక జరిగింది,జనసేన నాయకులు, సొసైటీ అధ్యక్షుడు కొణతాల ప్రసాద్ నివాసంలో ఈ కార్యక్రమం నిర్వహించారు,జనసేన సీనియర్ నాయకులు, మాజీ డీసీసీబీ చైర్మన్ కారటం రాంబాబు ఆయన ఇంటికి విచ్చేశారు,ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి కారటం రాంబాబును మర్యాదపూర్వకంగా కలిశారు,అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు, నాయకుల మధ్య ఆత్మీయ పలకరింపులు,పరస్పర యోగక్షేమాల చర్చలు జరిగాయి,జనసేన పార్టీకి సంబంధించిన పలు అంశాలపై నాయకులు అభిప్రాయాలు పంచుకున్నారు,ఈ కలయికతో స్థానిక జనసేన శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది,పార్టీ నాయకుల మధ్య స్నేహపూర్వక వాతావరణం కనిపించింది,ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మంగిన వెంకటరమణ సొసైటీ అధ్యక్షులు కొణతల ప్రసాద్ నీటి సంఘం అధ్యక్షులు పాదం ప్రసాద్ టీడీపీ మాజీ మండల అధ్యక్షులు పాపోలు గణపతి రత్తయ్య జనసేన నాయకులు మొగళ్ల హరిబాబు టిడిపి నాయకురాలు మడకం లక్ష్మి స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు,ఆత్మీయ కలయిక ఆనందోత్సాహాల మధ్య కొనసాగింది.

చంద్రబాబుకు గుణపాఠం తప్పదు

ఫ్యానుకు ఓటు వేయండి: బద్దెవోలు ప్రచారంలో కాకాణి



మనుబోలు స్వర్ణ సాగరం

మనుబోలు మండలం లోని బద్దెవోలు గ్రామంలో వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి ఉగ్గుమూడి లక్ష్మి ప్రియాంక, జడ్పీటీసీ అభ్యర్థి గుండాల వజ్రమ్మలకు మద్దతుగా సోమవారం మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మోసం చేసిన చంద్రబాబుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల సమయంలోనే ప్రజలు గుర్తుకొస్తారని, కొత్త పింఛన్ల పేరుతో మరోసారి మభ్యపెడుతున్నారని ఆరోపించారు.జగన్, చంద్రబాబు పాలనను బేరీజు వేసుకుని ప్రజలు ఓటు వేయాలని కోరారు. వైసీపీ కార్యకర్తలు బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీటీసీ అభ్యర్థి లక్ష్మీ ప్రియాంక, జడ్పీటీసీ అభ్యర్థి వజ్రమ్మలకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్ రెడ్డి, వైసీపీ నాయకులు ఏడం మల్లికార్జున్ రెడ్డి, శశికుమార్ రెడ్డి, ఆవుల మనోహర్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

"పేడూరు" "ప్రాదేశికంలో" రసవత్తర "పోరు"

గంభీరంగా "గండవరం"గుంభనంగా "తూపిలి"

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం నవంబర్ 2





మండలంలోని పేడూరు ప్రాదేశిక నియోజకవర్గం అన్ రిజర్వుడ్ కావడంతో స్థానిక రైతు కుటుంబాలు పోటీకి దిగారు. టిడిపి నుంచి గండవరం సోమ శేఖర్ రెడ్డి వైకాపా నుంచి తూపిలి ఉదయ కుమార్ రెడ్డి మధ్య గట్టి పోటీ నెలకొంది ఈ గ్రామం మొదటి నుంచి సోమిరెడ్డి కుటుంబీకులకు కేంద్రబిందువు కావడం విశేషం. జాఫర్ సాహెబ్ కమిటీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఈ ప్రాంతం ద్వారా కీలక పదవి పొందారు. సోమశేఖర్ రెడ్డి టిడిపిలో మొదటి నుంచి ఆ పార్టీకి విధేయుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఎంపీటీసీ ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తా మన్న గట్టి విశ్వాసంతో ఉన్నారు వైకాపా నుంచి పోటీలో ఉన్న తూపిలి ఉదయ్ కుమార్ రెడ్డి వైకాపా పాలన లో మాజీ మంత్రి కాకాణిగోవర్ధన రెడ్డికి అత్యంత విధేయునిగాగ్రామ అభివృ ద్ధిలో కీలక పాత్ర పోషించారుఅ ందరిని సమానంగా గౌరవించే మనస్తత్వం కలిగిన ఉదయ్ కుమార్ రెడ్డితనకు ఎన్నికల్లో ప్రజలు తప్పక గెలిపిస్తారన్న దృఢవిశ్వాసంతో ప్రచారంలో దూసుకుపోతున్నారుగ్రామరాజకీయాలను ప్రభావితం చేయడంలోసుదీర్ఘ అనుభవం కలిగిన వైకాపా నేతతిక్కవరపు సనత్ కుమార్ రెడ్డిఅండదండలుపుష్కలంగా ఉండడం ఇటీవల బీసీ వర్గాల నుంచి బలమైన వ్యక్తులు వైకాపాలోచేరడం ఉదయ్ కుమార్ రెడ్డికికలిసి వస్తాయన్న అభిప్రాయం సర్వత్ర వినవస్తుంది.ఏది ఏమైనప్పటికీ పేడూరు ప్రాదేశికఎన్నికమండలంలో ఉత్కంఠ గా మారింది.

స్వర్ణసాగరం
RNI No : APTEL/2004/12905
8

ఆదర్శ కుటుంబానికి రూ.75 కోట్లు
వెంకటేశ్ 'ఆదర్శ కుటుంబం' బ్లాక్‌బస్టర్ !

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఆదర్శ కుటుంబం' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకెళ్తోంది. విడుదలైన తొలి వారాంతంలోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.75 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించినట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా చిత్ర బృందం 'బ్లాక్‌బస్టర్' అంటూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. దీంతో వెంకటేశ్ అభిమానులు, చిత్ర బృందం ఈ విజయాన్ని ఆనందంగా జరుపుకుంటున్నారు. చాలా కాలం తర్వాత వెంకటేశ్, త్రివిక్రమ్ కలిసి పనిచేయడంతో ఈ సినిమాపై మొదటి నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథాంశంతో రూపొందిన ఈ చిత్రంలో వెంకటేశ్‌కు జోడీగా శ్రీనిధి శెట్టి నటించారు. నివేదా పేతురాజ్, రావు రమేశ్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని చిత్ర బృందం ప్రకటించింది. తొలి వారాంతానికే ప్రపంచవ్యాప్తంగా రూ.75 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం సినిమాకు లభిస్తున్న ఆదరణను తెలియజేస్తోంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని నిర్మాతలు ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో 'బ్లాక్‌బస్టర్' అని ప్రకటిస్తూ వసూళ్ల వివరాలను వెల్లడించారు. విదేశీ మార్కెట్‌లోనూ 'ఆదర్శ కుటుంబం'కు మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా అమెరికాలో ఈ సినిమా ఇప్పటికే 10 లక్షల డాలర్లకు పైగా వసూళ్లు సాధించింది. మరోవైపు దేశీయంగా ప్రముఖ టికెట్ బుకింగ్ వేదిక బుక్‌మైషోలోనే 10 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం పేర్కొంది. ఈ లెక్కలు సినిమాకు ప్రేక్షకుల నుంచి లభిస్తున్న ఆదరణను తెలియజేస్తున్నాయి. తొలి వారాంతంలో మంచి వసూళ్లు సాధించినప్పటికీ, సోమవారం నుంచి సినిమా వసూళ్లు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. సాధారణంగా వీకెండ్ హాలీడేస్‌లో థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అయితే వీక్ డేస్‌లోను అదే స్థాయిలో ప్రేక్షకులను ఆకర్షించగలిగితే సినిమా వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. కుటుంబ ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుని రూపొందిన ఈ చిత్రానికి వచ్చే రోజుల్లో ఎలాంటి ఆదరణ లభిస్తుందో చూడాలి. తొలి వారాంతంలో రూ.75 కోట్ల మార్కును అందుకున్న 'ఆదర్శ కుటుంబం' వసూళ్లు మరింత పెరిగి కొత్త రికార్డులు సృష్టిస్తాయా? అనేది ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



ప్రేమలో దారుణంగా మోసపోయానంటున్న హీరోయిన్ రెజీనా

గ్లామరస్ పాత్రలకే పరిమితం కాకుండా, విభిన్నమైన కథలు, పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రెజీనా కసాండ్రా. కథానాయికగా మాత్రమే కాకుండా ప్రతినాయిక ఛాయలున్న పాత్రల్లోనూ నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం నయనతార ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మూకుత్తి అమ్మన్ 2' సినిమాలో కీలకమైన ప్రతికూల ఛాయలున్న పాత్రలో కనిపించనున్నారు. తెలుగులో ఈ చిత్రం 'మహాశక్తి' పేరుతో విడుదల కానుంది. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న రెజీనా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించారు. గతంలో ప్రేమలో ఎదురైన చేదు అనుభవం తనను ఎంతగా కుంగదీసిందో వివరించారు. తన గత ప్రేమ బంధం గురించి మాట్లాడుతూ.. 2020లో తన జీవితంలో ఊహించని సంఘటన చోటుచేసుకుందని రెజీనా వెల్లడించారు. ప్రేమ బంధం అర్థాంతరంగా ముగియడంతో పాటు, ఆ సంబంధంలో తాను తీవ్రంగా మోసపోయానని చెప్పారు. ఆ పరిణామం తనపై తీవ్ర మానసిక ప్రభావం చూపిందని, కొంతకాలం డిప్రెషన్‌తో బాధపడ్డానని తెలిపారు. ఆ బాధ నుంచి బయటపడటానికి చాలా సమయం పట్టిందని, ఆ అనుభవం తర్వాత కొంతకాలం ఎలాంటి కొత్త ప్రేమ బంధంలోకి వెళ్లకూడదని నిర్ణయించుకున్నానని రెజీనా పేర్కొన్నారు. ఆ సమయంలో ఎదురైన మానసిక సంఘర్షణ తన జీవితాన్ని మరో కోణంలో ఆలోచించేలా చేసిందని వివరించారు. కష్టకాలం నుంచి బయటపడటానికి తనకు తానే సమయం కేటాయించుకోవడం ఎంతో ఉపయోగపడిందని రెజీనా చెప్పారు. ఇతరుల నుంచి ప్రేమ, ఆదరణ, ఓదార్పు ఆశించే ముందు మనల్ని మనం ప్రేమించుకోవడం నేర్చుకోవాలని సూచించారు. ప్రేమలో ఎదురైన వైఫల్యాలే కాకుండా, చాలామంది యువతులు జీవితంలో ఏదో ఒక దశలో లైంగిక వేధింపులు, ఇతర చేదు అనుభవాలను ఎదుర్కొంటున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. తన స్నేహితులతో మాట్లాడినప్పుడు ఇలాంటి సమస్యలు ఎంత విస్తృతంగా ఉన్నాయో అర్థమైందని తెలిపారు. ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు బాధితులు తమనే తాము నిందించుకోవద్దని రెజీనా సూచించారు. 'నాకే ఎందుకు ఇలా జరిగింది?' అని ఆత్మన్యూనతకు గురికాకుండా, జరిగిన విషయాలను మనసులో దాచుకోకుండా నమ్మకమైన వారితో పంచుకోవాలని చెప్పారు. ధైర్యంగా తమ బాధను బయటపెట్టినప్పుడే ఆ చేదు అనుభవాల నుంచి బయటపడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఆర్‌సీ17పై మరో ప్రచారం.. గుజరాతీ బ్లాక్‌బస్టర్ రీమేక్ అంటూ రూమర్స్!

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమాపై రోజుకో ఆసక్తికరమైన వార్త తెరపైకి వస్తోంది. 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు పూర్తికాగా, విడుదలైన ప్రీ లుక్ పోస్టర్ మరింత ఆసక్తిని పెంచింది. అయితే తాజాగా ఈ సినిమా కథపై మరో ప్రచారం మొదలైంది. గుజరాతీలో సంచలనం సృష్టించిన 'లాలో' చిత్రానికి ఇది రీమేక్ అంటూ వార్తలు వైరల్ అయ్యాయి. కానీ ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తెలుస్తోంది. 'ఆర్‌సీ 17' ప్రీ లుక్ పోస్టర్ విడుదలైనప్పటి నుంచి సినిమా కథపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పోస్టర్‌లో ఉపయోగించిన రంగులు, చిత్రీకరణ శైలి నేపథ్యంలో ఈ సినిమాలో పౌరాణిక అంశాలు ఉండబోతున్నాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా రామ్ చరణ్ శ్రీకృష్ణుడి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే ఈ విషయాలపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇదిలా ఉండగా, గుజరాతీలో విడుదలై విజయం సాధించిన 'లాలో' (2025) సినిమాను తెలుగులో రామ్ చరణ్‌తో రీమేక్ చేయబోతున్నారంటూ వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఈ ప్రాజెక్టే సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఆర్‌సీ 17' అని ప్రచారం మొదలైంది. దీంతో అభిమానుల్లోనూ ఆసక్తి పెరిగింది. అయితే ఈ రెండు సినిమాలకు ఎలాంటి సంబంధం లేదని తెలుస్తోంది. సుకుమార్ 2024 మార్చిలోనే రామ్ చరణ్‌తో తన తదుపరి సినిమాను ప్రకటించారు. అప్పటి నుంచే ఈ చిత్ర కథపై ఆయన పని చేస్తున్నారు. 'లాలో' విడుదలకు ముందే 'ఆర్‌సీ 17' కథలోని కీలక భాగాన్ని సుకుమార్ సిద్ధం చేసినట్లు సమాచారం. అందువల్ల ఈ సినిమా గుజరాతీ చిత్రానికి రీమేక్ అనే ప్రచారానికి ఆధారం లేదని స్పష్టమవుతోంది. మరోవైపు 'లాలో' చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేయబోతున్నారనే వార్తలు కూడా వినిపించాయి. అయితే ఆ రీమేక్‌లో రామ్ చరణ్ నటించడం లేదని, మరో హీరో ప్రధాన పాత్ర పోషించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. దీంతో 'ఆర్‌సీ 17'ను 'లాలో' రీమేక్‌గా పేర్కొంటూ వస్తున్న వార్తలకు తెరపడినట్లయింది.

Edited Printed Published & Owned by DAMA VIJAYA KUMAR. And Printed at VSR Printers, # 1-176, Vakadu Village and post, Vakadu Mandal, Tirupati District, Pin : 524415, AP.
Published at **VSR** Publications, H.No. 403, Panta Street, Chittoor, Andhra pradesh, Pin : 517501, **EDITOR DAMA VIJAYAKUMAR**, **RNI. NO. APTEL/26/A2367**